


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం,
అక్టోబర్ 8, 2024


సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-



## సీఎం అభ్యర్థి ఎవరైనా ఓకే!

కాంగ్రెస్, ఎన్సీపీలు ఎవరిని ఎంపిక చేసినా మద్దతు: ఉద్ధవ్

మహారాష్ట్ర రక్షణే లక్ష్యమని వెల్లడి



## కాంగ్రెస్‌కు నో ఎంట్రీ బోర్డు!

చాలా రాష్ట్రాలు ఆ పార్టీని కోరుకోవడంలేదు.. కుల చిచ్చు ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొట్టారు

కార్యకర్తల వల్లే హరియాణా గెలుపు : మోదీ

# నిర్వాసితుల్ని నష్టపోనివ్వం



ప్రత్యామ్నాయ నివాసాలు కల్పిస్తాం

సామాన్య ప్రజలకు, బడుగు, బలహీన వర్గాల వారికి నష్టం జరగకుండా చర్యలు

వర్షాలు, వరదలతో హైదరాబాద్‌లో వచ్చే కల్లోలాన్ని అరికట్టాలంటే కూల్చివేతలు తప్పవు

అసదుద్దీన్‌కు స్పష్టం చేసిన రేవంత్‌రెడ్డి

ఢిల్లీలో సీఎంను కలిసిన ఎంఐఎం అధినేత

న్యూఢిల్లీ, అక్టోబరు 8 : హైదరాబాద్‌లో వర్షాలు, వరదల వల్ల ఏర్పడుతున్న కల్లోల పరిస్థితులను అరికట్టాలంటే కూల్చివేతలు తప్పవని సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. అయితే ఈ కూల్చివేతలతో నిర్వాసితులయ్యే వారికి న్యాయం చేస్తామన్నారు. వారికి ప్రత్యామ్నాయ నివాస ఏర్పాట్లు కల్పించేందుకు ఇప్పటికే తగిన ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. సామాన్య ప్రజలకు, బడుగు, బలహీన వర్గాల వారికి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నదే తన ఉద్దేశమని చెప్పారు. మంగళవారం ఢిల్లీలోని సీఎం అధికార నివాసంలో తనను కలిసిన ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి ఈ విషయాన్ని రేవంత్ స్పష్టం చేశారు. ఓవైపు హైడ్రా, మరోవైపు మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా చెరువులు, మూసీలో ఆక్రమణలను ప్రభుత్వం కూల్చివేస్తుండడంపై విపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. కాగా, హైడ్రా కూల్చివేతలను మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న అసదుద్దీన్.. ముఖ్యమంత్రితో భేటీలో ప్రధానంగా ఈ అంశాన్నే ప్రస్తావించినట్లు తెలిసింది. కూల్చివేతల కారణంగా బలహీన వర్గాలకు చెందిన పేదలు, పేద ముస్లింలు రోడ్డున పడతారని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. పేదల ఇళ్ల కూల్చివేతపై పునరాలోచించాలని, వారికి నష్టం జరగని విధంగా ముందుకెళ్లాలని సీఎం రేవంత్‌ను ఆయన కోరినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. హైడ్రా, మూసీ ఆక్రమణల కూల్చివేతల విషయంలో ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాకే చర్యలు

(మిగతా 2వ పేజీలో)



# హర్యానాలో కాంగ్రెస్‌కు షాక్

48 సీట్లతో మరోసారి అధికారంలోకి.. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులు

- అనూహ్యంగా హ్యాట్రిక్ సాధించిన బీజేపీ
- ఫలితాలను అంగీకరించమన్న హస్తం పార్టీ
- జమ్ముకశ్మీర్‌లో ఇండియా కూటమి జయకేతనం
- 3 రాష్ట్రాల్లో ప్రజలను వంచించిన ఫలితం
- కాంగ్రెస్‌ను ఈడ్చికొట్టిన హర్యానా ఓటర్
- ఏడు గ్యారెంటీలతో ఏమార్చాలనుకొన్న
- హస్తానికి దిమ్మదిరిగిపోయేలా జవాబు
- కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ఎఫెక్ట్‌తో అప్రమత్తమై..
- ఎవరూ ఊహించని తీర్పు

చండీగఢ్: హర్యానాలో కాంగ్రెస్ పార్టీకి ఊహించని షాక్ తగిలింది. పదేండ్ల తర్వాత మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని కలలు కన్న ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. రైతులు, రెజ్లర్ల పోరాటం, పదేండ్ల బీజేపీ పాలనపై ఉండే ప్రభుత్వ వ్యతిరేకతతో ఈసారి గెలుపు ఖాయమనుకున్న చోట హస్తం పార్టీ బొక్కబోర్లా పడింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ మూడోసారి అధికారాన్ని కైవసం చేసుకుంది. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన మొదట్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఫలితాల సరళి కనిపించింది. కానీ, బీజేపీ అనూహ్యంగా పుంజుకొని మ్యాజిక్ ఫిగర్‌ను దక్కించుకుంది. 90 సీట్లకు గానూ ఆ పార్టీకి 48 సీట్లు దక్కగా, కాంగ్రెస్ పార్టీ 37 సీట్లకు పరిమితమైంది. స్వతంత్రులు

2లో

# కమలం ఖుషీ



2లో

- ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించి మూడోసారి విజయం
- హరియాణాలో 90 సీట్లకుగాను 48 స్థానాల్లో బీజేపీ గెలుపు
- 37 స్థానాలతో సరిపెట్టుకున్న కాంగ్రెస్.. ఖాతా తెరవని ఆప్
- లెక్కింపులో తొలుత కాంగ్రెస్ జోరు.. తర్వాత పుంజుకున్న బీజేపీ
- కాంగ్రెస్ భస్మాసుర హస్తం.. కుమ్ములాటలతో గెలుపు దూరం
- హస్తంవైపు జాట్లు.. దాంతో బీజేపీవైపునకు జాటేతర వర్గాలు!

## జగన్ హయాంలో
# అస్తవ్యస్తంగా ఆర్థిక రంగం

- పూర్తిగా కోలుకునేందుకు కేంద్రం మద్దతు కావాలి
- స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు అన్నివిధాలా చర్యలు
- రెండేళ్లలో పోలవరం, భోగాపురం విమానాశ్రయం
- డిసెంబరు నుంచి రాజధాని పనులు వేగవంతం
- రెండోరోజు అమిత్ షా, నిర్మల, గడ్కరీ, పీయూష్, కుమారస్వామి, హర్దీప్‌సింగ్‌తో సీఎం చర్చలు
- మీడియాకు వివరాలు వెల్లడించిన చంద్రబాబు





2లో

## ఎస్సీ వర్గీకరణకు వన్‌మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్

సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తితో ఏర్పాటు

వర్గీకరణ అధ్యయనంపై కాలపరిమితి తప్పనిసరి

2011 జనగణన గణాంకాల ఆధారంగా వర్గీకరణకు చర్యలు

వర్గీకరణ కమిటీ ఆధ్వర్యంలో త్వరలో జిల్లాలవారీగా పర్యటనలు

మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్: రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వర్గీకరణ ప్రక్రియను అధ్యయనం చేసేందుకు వన్‌మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని వర్గీకరణ కోసం

# హరియాణా, జమ్మూ-కశ్మీర్‌లో కమలం హవా



రేసులో ముందుకు దూసుకుపోయింది. మొత్తం 90 సీట్లకుగాను.. 48 స్థానాల్లో విజయఢంకా మోగించి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. ఎన్నికల షెడ్యూలు వెలువడినప్పటి నుంచి ఎగ్జిట్ పోల్స్ దాకా.. ప్రతి దశలోనూ గెలుపుపై ధీమాతో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేవలం 37 సీట్లకు పరిమితమై మరోసారి ఓటమి చేదును చవిచూసింది. ఐఎన్ఎల్‌డీ రెండు సీట్లతో సరిపెట్టుకోగా.. కాంగ్రెసతో పొత్తు కుదరక సొంతంగా పోటీ చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ డకౌట్ అయిపోయింది! ఇక.. గత ఎన్నికల్లో 10 సీట్లు సాధించి కింగ్ మేకర్ పాత్ర పోషించిన జన్‌నాయక్ జనతా పార్టీ (జేజేపీ) ఈసారి ఒక్క సీటు కూడా సాధించలేక చతికిలపడింది! సాక్షాత్తూ ఆ పార్టీ అధ్యక్షుడు దుష్యంత్ చౌతాలా దారుణాతిదారుణంగా ఓడిపోయారు. ఇక.. ఈ ఎన్నికల్లో పోటీ చేసి అందరి దృష్టినీ ఆకర్షించిన వినేశ్ ఫొగట్, సావిత్రి జిందాల్ గెలుపొందడం విశేషం. కాంగ్రెస్ తరపున పోటీ చేసిన వినేశ్ తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి యోగేశ్ కుమార్‌పై 6,015 ఓట్ల తేడాతో గెలిచారు. భారతదేశంలోనే అత్యంత సంపన్న మహిళ అయిన సావిత్రి జిందాల్.. హిసార్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఇంత సంతోషంలోనూ బీజేపీకి అసంతృప్తి కలిగించే విషయం.. ఆ పార్టీకి చెందిన 8 మంది మంత్రులు, స్పీకర్ ఓడిపోవడం. అటు హరియాణా కాంగ్రెస్ చీఫ్ ఉదయ్ భాన్, ఐఎన్ఎల్‌డీ చీఫ్ అభయ్ సింగ్ చౌతాలా కూడా ఓడిపోవడం గమనార్హం. కాగా.. 1966లో ఏర్పాటైన హరియాణాలో ఒక పార్టీ వరుసగా మూడోసారి గెలవడం ఇదే!

### కాంగ్రెస్ స్వయంకృతం

హరియాణాలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీపై సహజంగా ఏర్పడిన వ్యతిరేకత, జాట్ సామాజికవర్గంలో ప్రభుత్వంపై నెలకొన్న ఆగ్రహం, దేశానికి అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని తెచ్చిపెట్టిన క్రీడాకారుల్లో కొందరు రాజకీయ ఆరంగేట్రం చేసి కాంగ్రెస్ పక్షాన నిలబడడం, రైతు ఆందోళనలు, పెరిగిన ధరలు, నిరుద్యోగం, అగ్నివీర్ పథకంపై అసంతృప్తి వంటి అనేక పరిణామాల నేపథ్యంలో.. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమనే ప్రచారం విస్తృతంగా జరిగింది. అయితే.. ప్రభుత్వ వ్యతిరేకతను తనవైపు తిప్పుకోవడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైంది. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వంలో వర్గపోరు వారి గెలుపు అవకాశాలకు దూరం చేసింది. జాట్ వర్గం నేత భూపిందర్ సింగ్ హుడాకు దళిత వర్గం నేత కుమారి సెల్జాకు మధ్య విబేధాలు ఎన్నికల్లో స్పష్టంగా కనిపించాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం హుడాకు పూర్తిస్వేచ్ఛనివ్వడంతో రాష్ట్రంలోని మొత్తం 90 స్థానాల్లో 70 సీట్లు తన వర్గంవారికే ఇచ్చుకున్నారని.. ఇది కుమారి సెల్జాకే కాక, జాట్ వర్గానికే చెందిన రణ్‌దీప్ సింగ్ సూర్జేవాలాకు సైతం మింగుడుపడలేదని చెబుతున్నారు. దీంతో, ఎవరికి వారు రెబల్ అభ్యర్థులను నిలబెట్టడంతో పార్టీకి నష్టం వాటిల్లింది. బీజేపీని కూడా రెబెల్ అభ్యర్థులు దెబ్బ తీశారు.

### జాట్లు.. జాటేతరులు..

జాట్లు వర్సెస్ జాటేతర వర్గాలుగా చీలిపోయిన హరియాణా ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు ద్వారా విస్పష్టమైన తీర్పుచెప్పారు. జాట్లలో అత్యధికులు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపగా.. జాటేతరుల్లో అత్యధికులు బీజేపీకి ఓటేయడంతో.. కమలనాథులు అనూహ్య విజయం సాధించారు. రెండు పార్టీల మధ్య ఓటు శాతం అత్యంత తక్కువగా ఉండడానికి కారణం ఇదే. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ అంతర్గత కలహాలతో సతమతమవుతుంటే.. మరోవైపు బీజేపీ తనదైన శైలిలో ఎన్నికల వ్యూహాలను అమలు చేసింది. మరోవైపు, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లకు ఆమ్ ఆద్మీ, బీఎస్పీ రూపంలో గండి పడింది. ఇది బీజేపీకి ఎంతగానో అనుకూలించగా, కాంగ్రెసకు తీవ్రంగా నష్టం చేసింది. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉన్న ఆప్ హరియాణాలో మాత్రం ఒంటరిగా బరిలో దిగింది.

# ఆంధ్రప్రదేశ్‌కు బుల్లెట్ ట్రైన్

పనులు వేగంగా నడుస్తున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం ఏడు మార్గాల్లో ఈ హై స్పీడ్ రైళ్లను నడపాలని రైల్వే శాఖ గతంలో నిర్ణయించింది. ఇందులో దక్షిణాదిలో రెండు మార్గాలు ఉన్నాయి. చెన్నై నుంచి బెంగళూరు మీదుగా మైసూరు వరకూ ఒక ట్రైన్, ముంబాయి నుంచి హైదరాబాద్‌కు మరో ట్రైన్‌ను ఇందులో ప్రతిపాదించారు. మొదటి దశ ప్రతిపాదనల్లో ఆంధ్రప్రదేశ్ లేదు. కాని తాజాగా ఏపీని కూడా ఇందులో చే ర్చినట్లు ముఖ్యమంత్రి.... ఎంపీలకు తెలిపారు. దక్షిణాదిలో బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అమరావతి నగరాలు కలిసేలా బుల్లెట్ రైళ్లు నడపడానికి ప్రతిపాదనలు తయారవుతున్నాయని ఆయన చెప్పారు. దీని కోసం ప్రత్యేకంగా రైల్వే ట్రాక్ వేయాల్సి ఉంటుందని, పూర్తి ప్రతిపాదనలు సిద్ధమైన తర్వాత రైల్వే శాఖ వివరాలు వెల్లడిస్తుందని ఆయన పేర్కొన్నారు.

### రామాయపట్నంపై బీపీసీఎల్ మొగ్గు

రూ.అరవై వేల కోట్ల పెట్టుబడితో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్న భారత్ పెట్రోలియం కంపెనీ... రామాయపట్నంపై మొగ్గు చూపుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఎంపీలకు తెలిపారు. ఈ కంపెనీ తన రిఫైనరీ ఏర్పాటుకు మూడు రాష్ట్రాలను పరిశీలించింది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌ను ఎంపిక చేసుకొంది. ఏపీలో మూడు ప్రాంతాలను ఆ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. మచిలీపట్నం, రామాయపట్నం, మూలపాడు (శ్రీకాకుళం) పోర్టు ప్రాంతాలను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మూడు ప్రాంతాలను పరిశీలించిన తర్వాత ఆ కంపెనీ....రామాయపట్నం వైపు మొగ్గు చూపుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. రామాయపట్నం నెల్లూరు జిల్లాలో కందుకూరు ప్రాంతంలో ఉంది. వెయ్యి ఎకరాల్లో రూ. అరవై వేల కోట్ల పెట్టుబడితో వచ్చే ఈ రిఫైనరీ ఆ ప్రాంత స్వరూపాన్ని మార్చివేసే అవకాశాలు ఉన్నాయి. ఈ రిఫైనరీ ఏర్పాటుకు మచిలీపట్నం పోర్టు ప్రాంతాన్ని ఎంపిక చేసే అవకాశాలు పరిశీలించాలని బందరు ఎంపీ బాలశౌరి ఈ సమావేశంలో ముఖ్యమంత్రిని కోరారు. బీపీసీఎల్ తనకు నచ్చిన ప్రాంతాన్ని తాను ఎంపిక చేసుకొంటుందని ముఖ్యమంత్రి ఆయనకు చెప్పారు.

### గ్రీన్ హైడ్రోజన్‌లో లక్ష కోట్ల పెట్టుబడి

విశాఖపట్నం ప్రాంతంలో రూ. లక్ష కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు రాబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు వస్తోందని, దేశంలోనే ఇది అతి పెద్ద ప్రాజెక్టని ఆయన వెల్లడించారు. పునరుత్పాదక ఇంధనాల్లో ఇది కొత్త తరం టెక్నాలజీకి సంబంధించిందని, ఇక్కడ ఉత్పత్తి అయిన గ్రీన్ హైడ్రోజన్‌ను ఎగుమతి చేయడానికి కూడా అవకాశాలు ఉన్నాయని ఆయన ఎంపీలకు చెప్పారు.

# ఎస్సీ వర్గీకరణకు వన్‌మ్యాన్ జ్యుడీషియల్ కమిషన్

రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. ఎస్సీ వర్గీకరణ కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు కావడం తెలిసిందే. ఈ కమిటీ మంగళవారం సచివాలయంలో భేటీ అయింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులైన మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ సీతక్క, పార్లమెంటు సభ్యులు మల్లు రవితోపాటు సీఎస్ శాంతికుమారి, ఏజీ సుదర్శన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

### ఆర్థిక శాఖ నుంచి 30%సమాచారం: ఉత్తమ్

రాష్ట్రంలో వర్గీకరణ ప్రక్రియను 2011 జనగణన ఆధారంగా చేపట్టాలని కమిటీ దాదాపు నిర్ణయించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు రాష్ట్రంలోని ఉద్యోగ నియామక బోర్డుల నుంచి ఎస్సీ ఉపకులాలవారీగా నియామకాల సమాచారాన్ని స్వీకరించామని, ఆర్థిక శాఖ నుంచి 30 శాతం సమాచారం వచ్చిందని మంత్రి ఉత్తమ్ వివరించారు. గత నెల 30 నుంచి విజ్ఞాపనల స్వీకరణ ప్రారంభించగా ఇప్పటివరకు 1,082 సూచనలు వచ్చినట్లు చెప్పారు.

### ఆ రెండు రాష్ట్రాల్లో వన్‌మెన్ కమిషన్..

ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్న పంజాబ్, తమిళనాడులలో అధికారుల బృందం అధ్యయనం చేసిందని, ఎన్నికల కోడ్ నేపథ్యంలో హరియాణాలో అధ్యయనం చేయలేదన్నారు. పంజాబ్‌లో ఎస్సీ కేటగిరీలో రెండు గ్రూపులుగా వర్గీకరణ చేశారని, తమిళనాడులో విద్య, ఉపాధిలో ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, ఆ రాష్ట్రంలో 76 ఎస్సీ ఉపకులాలు ఉన్నట్లు ఉత్తమ్ వివరించారు. ఆ రెండు రాష్ట్రాల్లో వర్గీకరణ ప్రక్రియ చట్టపరమైన చిక్కుల్లేకుండా అమలు చేసేందుకు వన్‌మెన్ కమిషన్ ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. వర్గీకరణ అధ్యయనాన్ని సకాలంలో పూర్తి చేయడానికి కమిషన్‌కు కాలపరిమితి విధించాలని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. జిల్లాలవారీగా పర్యటించి ఎస్సీ వర్గాల అభిప్రాయాలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. దీంతో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ వర్గీకరణపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ఉపసంఘం సభ్యులు త్వరలో జిల్లాల్లో పర్యటించాలని నిర్ణయించారు. వర్గీకరణ ప్రక్రియలో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్(సెస్) వంటి ప్రసిద్ధ ప్రభుత్వ సంస్థల సహకారం తీసుకోవాలన్నారు.

# విద్యుత్తు శాఖలో ఖాళీల భర్తీకి త్వరలో భారీ నోటిఫికేషన్

అనేక సంస్కరణలు చేపట్టబోతున్నామన్నారు. అందులో భాగంగా శాఖలో ఖాళీ పోస్టులన్నింటినీ భర్తీ చేయబోతున్నామని పేర్కొన్నారు. విద్యుత్తు శాఖలో ఎక్కడైనా సమస్యలు ఉన్నా, ఎవరైనా డబ్బులు అడిగినా 1912కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ నెంబర్‌కు ఫోన్ చేసిన ప్రతి ఒక్కరి వివరాలు తీసుకుని పర్యవేక్షణ చేస్తామన్నారు. వరదల సమయంలో విద్యుత్తు అధికారులు, సిబ్బంది కష్టపడి పనిచేశారని ప్రశంసించారు. రాష్ట్రంలో విద్యుత్తు శాఖ అధికారులు, సిబ్బందికి ఎప్పటికప్పుడు వృత్తిపరంగా మెళవకులు నేర్పేందుకు ఒక కాలేజీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్తు ఉత్పత్తికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందన్నారు. థర్మల్ పవర్‌తో పాటు సౌర, జల విద్యుత్, పవన విద్యుత్.. మొత్తం 20వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యనందించేందుకు అంతర్జాతీయ సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈనెల 11న పలుచోట్ల వీటికి శంకుస్థాపన చేయబోతున్నామని వెల్లడించారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకే మూసీ నదిని ప్రక్షాళన చేయాలని సంకల్పించామని భట్టి విక్రమార్క తెలిపారు. ఇది చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మూసీని అభివృద్ధి చేస్తామని బీఆర్ఎస్ పదేళ్లు అబద్ధాలతో కాలం గడిపిందని విమర్శించారు. మూసీలోని మురికిని వేరు చేసి మంచినీటిని ప్రవహింపచేస్తే హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నదికి పక్కన దుర్వాసనలో జీవిస్తున్న వారికి మెరుగైన పునరావాసం అందిస్తామని చెప్పారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మూసీ అభివృద్ధి విషయంలో సలహాలు, సూచనలు ఇవ్వాలి తప్ప విమర్శలు చేయడం సరికాదని అన్నారు.

# కుటుంబ గౌరవానికి భంగం కలిగింది

తీసుకుంటారు. మంగళవారం మధ్యాహ్నం నాగార్జునతో పాటు భార్య అమల, సోదరి నాగసుశీల, కొడుకు నాగచైతన్య, మేనకోడలు సుప్రియ కోర్టుకు వచ్చారు. అసలు పరువు నష్టం దావా ఎందుకు దాఖలు చేశారని న్యాయమూర్తి శ్రీదేవి ప్రశ్నించారు. నాగార్జున వాంగ్మూలమిస్తూ, "దేశ వ్యాప్తంగా ఎందరో ప్రజల ఆదరాభిమానాలను పొందిన నాపై, నా కుటుంబంపై మంత్రి కొండా సురేఖ రాజకీయ దురుద్దేశంతో అమర్యాద పూర్వకంగా మాట్లాడారు. నా కొడుకు నాగ చైతన్య విడాకుల వ్యవహారం గురించి పూర్తి అవాస్తవమైన, అసత్యమైన వ్యాఖ్యలు చేశారు. "ఎన్ కన్వెన్షన్" కూల్చకుండా ఉండాలంటే మాజీ మంత్రి కేటీఆర్ దగ్గరకు వెళ్లాల్సిందిగా నేను సమంతను ఒత్తిడి చేసినట్టు ఎలాంటి ఆధారాలు లేకుండా మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేశారు. సినీ రంగంలో, జాతీయ స్థాయిలో మా కుటుంబ సభ్యులు ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు సాధించారు. సమాజం పట్ల బాధ్యతతో మా కుటుంబం చాలా ఏళ్లగా అనేక సేవా కార్యక్రమాలను కూడా చేస్తోంది. అలా దశాబ్దాలుగా తన కుటుంబం నిర్మించుకున్న గౌరవ మర్యాదలకు మంత్రి చేసిన వ్యాఖ్యలతో భంగం కలిగింది. తీవ్ర మనోవేదనకు లోనయ్యాం. అవమానం ఎదుర్కొన్నాం. ఇప్పటి వరకు మంత్రి కనీసం మమ్మల్ని క్షమాపణలు కోరలేదు, ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోలేదు. బాధ్యతా యుతమైన మంత్రి పదవిలో ఉండి ఈ విధంగా మాట్లాడడం, సినీరంగంపై రాజకీయాలు చేయడం సబబు కాదు" అన్నారు. నాగార్జున మేనకోడలు సుప్రియ ప్రథమ సాక్షిగా సురేఖ చేసిన వ్యాఖ్యలను న్యాయమూర్తికి చదివి వినిపించారు. "మంత్రి సురేఖ వ్యాఖ్యలు షాక్‌కు గురి చేశాయి. ఆమె వ్యాఖ్యలతో మా కుటుంబానికి మనశ్శాంతి లేకుండా పోయింది. నాగ చైతన్య, సమంత విడాకులకు మాజీ మంత్రి కేటీఆరే కారణమని, ఎన్ కన్వెన్షన్ వ్యవహారం గురించి కేటీఆర్ దగ్గరకు సమంతను నాగార్జున వెళ్లమంటే ఆమె ఒప్పుకోలేదని, అందుకే విడాకులు తీసుకుందని సురేఖ చేసిన వ్యాఖ్యలను వార్త చానెళ్లు, పత్రికల్లో చూసి షాక్‌కు గురయ్యా. అసలు ఆమె మా కుటుంబం గురించి ఇలా ఎందుకు మాట్లాడారో అర్థం కావడం లేదు. సినీ పరిశ్రమను రాజకీయంగా లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది. అందుకే సురేఖ వ్యాఖ్యలను చిత్ర పరిశ్రమ మొత్తం ముక్తకంఠంతో ఖండించింది' అని సుప్రియ తన వాంగ్మూలంలో చెప్పింది.

### ఆధారాలు సమర్పించాం: అశోక్‌రెడ్డి

ఈ కేసుకు సంబంధించి నాగార్జున తరపు న్యాయవాది అశోక్‌రెడ్డి మాట్లాడుతూ 'అక్కినేని నాగార్జున, ఆయన కుటుంబ సభ్యులపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల వీడియోలను, టీవీ చానెళ్లు, పత్రికలు, వివిధ వెబ్‌సైట్లలో వచ్చిన వార్తలను కోర్టుకు ప్రాథమిక సాక్ష్యాలుగా సమర్పించాం. తదుపరి విచారణను న్యాయమూర్తి గురువారానికి వాయిదా వేశారు. భారత న్యాయ సంహితలోని సెక్షన్ 356 ప్రకారం కేసు నమోదు చేయాలని పిటిషన్‌లో కోరాం' అని చెప్పారు.

### కేసు నిలబడదు: తిరుపతివర్మ

టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ తిరుపతి వర్మ మాట్లాడుతూ, "నాగార్జున, సుప్రియ వాంగ్మూలాలు ఒకదానికొకటి పొంతన లేకుండా ఉన్నాయి. ఆ వాంగ్మూలాలను బట్టి చూస్తుంటే కేసు నిలబడదని అనిపిస్తోంది. మంత్రికి న్యాయస్థానం సమన్లు ఇస్తే న్యాయ పోరాటం చేస్తాం. ఎంతదూరమైన వెళ్తాం. సురేఖపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నాం" అని తెలిపారు.

# నిర్వాసితుల్ని నష్టపోనివ్వం

చేపట్టాలని కోరినట్లు పేర్కొన్నాయి. మూసీ సుందరీకరణతో నిర్వాసితులయ్యే వారిని ఎలా ఆదుకోవాలన్న దానిపైనా అసద్ పలు సూచనలు చేసినట్లు తెలిసింది. కాగా, హైడ్రా కూల్చివేతలపై రెండు రోజుల క్రితం ఒవైసీ తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో సీఎంతో ఆయన భేటీ ఆసక్తికరంగా మారింది. ఇక సీఎం రేవంత్ తన ఢిల్లీ పర్యటనను ముగించుకొని మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. హరియాణా ఎన్నికల ఫలితాలతో ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు నిరాశలో కూరుకుపోవడంతో సీఎం రేవంత్ వారితో భేటీ కాలేకపోయారు. దీంతో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై చర్చలు మళ్లీ వాయిదా పడ్డాయని తెలుస్తోంది.

# సీఎం అభ్యర్థి ఎవరైనా ఓకే!

## కాంగ్రెస్, ఎన్సీపీలు ఎవరిని ఎంపిక చేసినా మద్దతు: ఉద్ధవ్

## మహారాష్ట్ర రక్షణే లక్ష్యమని వెల్లడి

ముంబై, అక్టోబరు 8: త్వరలో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేసినా తమ మద్దతు ఉంటుందని శివసేన(యూబీటీ) పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే స్పష్టం చేశారు. మహావికాస్ అఘాడీ(ఎంవీఏ) కూటమి పార్టీలైన కాంగ్రెస్, ఎన్సీపీ(ఎస్పీ)లు సీఎం అభ్యర్థిగా ఎవరిని ఎంపిక చేసినా తమకు అభ్యంతరం లేదని, వారికి మద్దతిస్తామని చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఆయన ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. మహారాష్ట్ర పరిరక్షణే తమ లక్ష్యమని, దీనికి సంబంధించి కూటమి పార్టీలు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా సమర్థిస్తామన్నారు. హరియాణాలో తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బతగిలి, బీజేపీ మరోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఉద్ధవ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మహాయుతి ప్రభుత్వం తప్పుడు ప్రకటనల ద్వారా నకిలీ ప్రచారం చేస్తోందని విమర్శించారు. 'లడ్కి బహిన్' పథకం కింద వెనుకబడిన వర్గాల్లోని మహిళలకు నెలకు రూ.1,500లు ఇస్తూ గొప్పలు చెబుతోందని, కానీ, వాస్తవానికి ప్రజల సొమ్మును ప్రజలకు ఇస్తూ.. వింత ప్రచారాలతో వారికి ద్రోహం చేస్తోందని దుయ్యబట్టారు. ఓటర్లపై హామీల వర్షం కురిపిస్తున్న మహాయుతి ప్రభుత్వం.. అమలులోకి వచ్చేసరికి మొండిచేయి చూపిస్తోందని విమర్శించారు. 288 స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీకి వచ్చే నెలలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని.. "నేను గతంలోనే చెప్పాను. ఇప్పుడు మరోసారి చెబుతున్నా.. కాంగ్రెస్, ఎన్సీపీ(ఎస్పీ)లు వేర్వేరుగా అయినా.. సంయుక్తంగా అయినా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించవచ్చు. వారు ఎవరిని ప్రకటించినా నా మద్దతు ఉంటుంది. ఎందుకంటే.. మహారాష్ట్ర అంటే నాకు ఇష్టం. ఈ రాష్ట్ర పరిరక్షణే నాకు ముఖ్యం. రాష్ట్రాన్ని కాపాడేందుకు ఏదైనా చేయాలన్నదే నా అభిమతం" అని ఉద్ధవ్ పేర్కొన్నారు. గుజరాత్‌కు-దేశంలోని ఇతర రాష్ట్రాలకు మధ్య అడ్డుగోడ నిర్మిస్తున్నారంటూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలపై ఆయన విమర్శలు గుప్పించారు. గుజరాతీ-మరాఠీ అనే భాషా వివాదాలు మహారాష్ట్రలో లేవని తేల్చిచెప్పారు. తమ పార్టీ ఎవరినీ శత్రువులుగా చూడబోదని, అయితే, దేశ వ్యతిరేకులు, మహారాష్ట్ర వ్యతిరేకులపై మాత్రం తమ యుద్ధం కొనసాగుతుందన్నారు.

### తేల్చాల్సింది ఆ పార్టీలే

కాగా, గత ఆగస్టులోనే ఉద్ధవ్ తన మనసులో మాటను చెప్పేశారు. ఎన్నికల ఫలితం వచ్చాక కాదు, ముందుగానే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించాలని, ఎవరిని ఎంపిక చేసినా తన మద్దతు ఉంటుందని చెప్పారు. ఉద్ధవ్ వ్యాఖ్యలకు శివసేన(యూబీటీ) కీలక నేత, ఎంపీ సంజయ్ రౌత్ మద్దతు పలికారు. ఆయన చాలా దూరదృష్టితో ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. అయితే.. కాంగ్రెస్, ఎన్సీపీ(ఎస్పీ)లు మాత్రం ఎన్నికల ఫలితం వచ్చే వరకు ఈ విషయంపై స్పందించబోమని స్పష్టం చేశాయి. దీంతో ఇప్పుడు ఈ రెండు పార్టీలే తేల్చాల్సి ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కాంగ్రెస్‌కు నో ఎంట్రీ బోర్డు!

## చాలా రాష్ట్రాలు ఆ పార్టీని కోరుకోవడంలేదు.. కుల చిచ్చు ప్రయత్నాన్ని ప్రజలు తిప్పికొట్టారు

## కార్యకర్తల వల్లే హరియాణా గెలుపు : మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 8: దేశంలోని చాలా రాష్ట్రాల్లో ప్రజలు కాంగ్రెసకు 'నో ఎంట్రీ' బోర్డు పెట్టారని ప్రధాని మోదీ అన్నారు. దశాబ్దాల తరబడి ఆ పార్టీకి అధికారం ఇవ్వకుండా దూరం పెడుతుండడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మంగళవారం హరియాణా, జమ్ముకశ్మీర్ ఎన్నికల ఫలితాల అనంతరం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మోదీ మాట్లాడారు. భారత ఆర్థిక వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా పలుచన చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించారు. చివరికి ఎన్నికల కమిషన్ వంటి సంస్థపై కూడా నిందలు వేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కులగణన పేరుతో ప్రజల మధ్య చీలిక తెచ్చేందుకు, ఎస్సీ, ఎస్టీలను, రైతులను, యువతను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. కానీ, హరియాణా ప్రజలు కాంగ్రెస్ దేశవ్యతిరేక చర్యలను తిప్పికొట్టేలా తీర్పునిచ్చారని పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తలు పూర్తి అంకితభావంతో ప్రజా సంక్షేమానికి పాటుపడుతూ, అభివృద్ధి అజెండాను ప్రజల వద్దకు తీసుకెళ్లటం వల్లే హరియాణాలో చరిత్రాత్మక విజయం దక్కిందన్నారు. ఇక జమ్ముకశ్మీర్ ఫలితం.. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం సాధించిన విజయమన్నారు. అక్కడ బీజేపీ అత్యధిక ఓట్లు సాధించిందని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ప్రతి రాష్ట్రంలోనూ సుదీర్ఘకాలం ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని మోదీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ.. ఇతర పార్టీలపై ఆధారపడే పరాన్నజీవిగా మారిందని, చివరికి ఆ పార్టీలనే మింగేస్తుందని ధ్వజమెత్తారు. జమ్ముకశ్మీర్‌లో కాంగ్రెసతో పొత్తు పెట్టుకున్న నేషనల్ కాన్ఫరెన్స్ కూడా.. హస్తం పార్టీ కారణంగా తమ అవకాశాలు ఎక్కడ దెబ్బతింటాయోనని భయపడిందన్నారు. కాగా, హరియాణాలో బీజేపీ గెలుపు కోసం అలుపెరగకుండా శ్రమించిన కార్యకర్తలందరికీ అభినందలు తెలియజేస్తున్నానని 'ఎక్స్'లో మోదీ పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌లో అధికారం సాధించిన నేషనల్ కాన్ఫరెన్స్‌కుఅభినందనలు తెలిపారు. అయితే, ఆ పార్టీ భాగస్వామ్యపక్షం కాంగ్రెసను మాత్రం తన ట్వీట్‌లో ప్రస్తావించకపోవటం గమనార్హం. జమ్మూకశ్మీర్‌లో బీజేపీ పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. హరియాణా ప్రజలు మోదీ నాయకత్వంలో అభివృద్ధి ఎజెండాను విశ్వసించి బీజేపీని గెలిపించారని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు.

### హరియాణా ఫలితాన్ని ఊహించలేదు: ఖర్గే

హరియాణాలో ఫలితం ఇలా వస్తుందని తాము ఊహించలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. అయితే ప్రజాతీర్పును శిరసావహిస్తామని, ఫలితాలపై విశ్లేషణ చేసుకుంటామని 'ఎక్స్'లో పేర్కొన్నారు. జమ్ము కశ్మీర్‌లో మాత్రం బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తీర్పునిచ్చారని అన్నారు. కాగా, ఈ ఓటమి తమకు గుణపాఠం నేర్పిందని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ అన్నారు. ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దని, ఎన్నికల సమయంలో అతివిశ్వాసం పనికిరాదని, ప్రతి ఎన్నికను, ప్రతి స్థానాన్ని ప్రతిష్ఠాత్మకంగానే భావించాలని ఆయన పార్టీ నేతలనుద్దేశించి వ్యాఖ్యానించారు.



## రజకుల సంక్షేమం కోసం 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలి ? గోపి రజక

### దుద్యాల్ వార్డ్ మెంబర్ చెన్నప్ప ను శాలువాతో సన్మానించిన గోపి రజక

వికారాబాద్, అక్టోబర్ 08(వార్త మిర్రర్ ):వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండల కేంద్రంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి అశోక్, జిల్లా సంయుక్త కార్యదర్శి సి వెంకటయ్య , గ్రామ ఉపాధ్యక్షులు అంజయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మండల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక ,అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు అన్నారం సాయిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపి రజక మాట్లాడుతూ 2016 డిసెంబర్ 26న రజక కులస్తుల సంక్షేమ పథకాలు గురించి ఆనాడు ఎమ్మెల్యేగా ఉన్న ఏ.రేవంత్ రెడ్డి మాట్లాడడం జరిగింది కానీ నేడు ముఖ్యమంత్రి హోదాలో రజక సంక్షేమం కోసం 500 కోట్ల బడ్జెట్ ని కేటాయించి సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. గత బడ్జెట్లో 150 కోట్లు కేటాయించడం అందులో 100 కోట్లు విద్యుత్ బకాయిలకు 50 కోట్లు సంక్షేమ పథకాల కోసం కేటాయించడం కొంత బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు . రజక సంక్షేమం కోసం ప్రత్యేకమైనటువంటి బడ్జెట్ కేటాయించి రజకులను ఆదుకోవాలని కోరారు. దుద్యాల్ గ్రామ వార్డు మెంబర్ చెన్నప్ప మాట్లాడుతూ తక్షణమే రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని అప్పుడే రజకులకు సామాజిక న్యాయం జరిగినట్లు భావిస్తామని వారన్నారు సమావేశానికి బిచ్చాల్ మొగులయ్య, వెంకటయ్య, లెక్చరర్ అనంతయ్య, భీములు, మరియు బుగ్గప్ప తదితరులు హాజరయ్యారు



## వెంకటేశ్వర నగర్ కాలనీ, శుభోదయం

### కాలనీలలో అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

రంగారెడ్డి జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి...దేవి శరన్నవరాత్రులలో భాగంగా ఈరోజు ఆరవ రోజు బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ మరియు చంపాపేట్ డివిజన్ పరిధిలోని శుభోదయం కాలనీ నందు నెలకొల్పిన శ్రీ దుర్గా దేవి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో సుధీర్ రెడ్డి తో పాటు బిఆర్ఎస్ నాయకులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, రాజిరెడ్డి, సుమన్ గౌడ్, రవి ముదిరాజ్, శ్రీనాథ్, సదానంద రెడ్డి, రాఘవేంద్రరావు సతీష్, చరణ్, ఉమామహేశ్వర్ మరియు నిర్వాహకులు పాల్గొన్నారు.




## ఈనెల 16న కాప్రా ప్రెస్ క్లబ్ ఎన్నికలు

### ఏకగ్రీవం,సమన్వయం కోసం కృషి

### సభ్యత్వంలో ప్రక్షాళన తధ్యం,సీనియర్లకు ప్రాధాన్యత

కాప్రా,వార్త మిర్రర్,అక్టోబర్08:ఈనెల 16న కాప్రా ప్రెస్ క్లబ్ ఎన్నికలు జరుగుతాయని కోర్ కమిటీ సభ్యులు మోతే వెంకట్ రెడ్డి తెలిపారు.మంగళవారం ఈసీఐఎల్ లోని కాప్రా ప్రెస్ క్లబ్ లో పాత్రికేయుల సమావేశం జరిగింది.ఏకగ్రీవం,సమన్వయం కోసం ప్రయత్నిస్తున్నామని కలిసి వచ్చే వారితో ఈ నెల 16న పూర్తిస్థాయిలో కాప్రా ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు.సీనియర్ పాత్రికేయుల అభిప్రాయం మేరకు సభ్యత్వ ప్రక్షాళన ఉంటుందని,కోర్ కమిటీ ప్రక్షాళన కార్యక్రమాలు చేపడుతుందన్నారు.కాప్రా ప్రెస్ క్లబ్ వేదిక నుంచి ప్రకటించే కమిటీ అధికారిక కార్యవర్గం అవుతుందన్నారు.ఎవరికి వాళ్లు కమిటీలు వేసుకుంటే కాప్రా ప్రెస్ క్లబ్ తో ఎలాంటి సంబంధం ఉండదని తేల్చి చెప్పారు.కోర్ కమిటీలోను ప్రక్షాళన చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు సభ్యులు సూచించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో ఈనెల 16న సీనియర్ల అభ్యర్థన మేరకు ఏకాభిప్రాయంతో సీనియర్లకు అవకాశం ఇస్తూ అందరికీ ఆమోదయోగ్యమైన కార్యవర్గం ఉంటుందని కోర్ కమిటీ సభ్యులు వారి వారి అభిప్రాయాలను స్పష్టం చేశారు.సమావేశానికి హాజరైన 46 మంది పాత్రికేయ మిత్రులు ఆమోదం తెలిపారు.ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమన్వయానికి సభ్యులంతా పూర్తిస్థాయి మద్దతును ప్రకటించారు.ఈ కార్యక్రమంలో కాప్రా,నాచారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన “ముచ్చర్ల జనార్దన్ రెడ్డి”

కల్వకుర్తి,ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన గుండాల లింగమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న మరణించడం జరిగింది. బీజేపి నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న బీజేపి రాష్ట్ర నాయకులు నాగర్ కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కరాటే అసోసియేషన్ చైర్మన్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి వారి ఆత్మకు శాంతి కలగాలని తెలిపి తక్షణ ఆర్థిక సహాయం రూ”5000 రూపాయలు గ్రామ బిజేపి నాయకుల ద్వారా మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపి మండల యువ నాయకులు కొండంసురేష్,నిరటి నరసింహ,పిట్టల నాగయ్య,నిరటి బాలస్వామి , పానది బాలకృష్ణ,కొండం కృష్ణయ్య , నిరటి జంగయ్య , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# దుబాయ్ లో ఘనంగా బతుకమ్మ పండుగ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 8

ఇండియన్ పీపుల్స్ ఫోరం తెలంగాణ కౌన్సిల్ ఆధ్వర్యంలో మూడవసారి బతుకమ్మ సంబరాలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దుబాయ్ లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి దుబాయ్ లో ఉన్నటువంటి ఉభయ రాష్ట్రాలకు చెందినటువంటి తెలుగు ప్రజలు వారి వారి కుటుంబ సభ్యులతో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ ధర్మపురి అరవింద్ మరియు ఆర్మూర్ శాసనసభ్యులు పైడి రాకేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని చూస్తుంటే నాకు తెలుగు రాష్ట్రంలో బతుకమ్మ వేడుక చేసుకున్నట్లు ఉందని అన్నారు. అదేవిధంగా ఇక్కడ సంస్కృతిని ఈ రకంగా ప్రోత్సహిస్తున్నటువంటి యూఏఈ అధ్యక్షునికి ధన్యవాదములు తెలియజేయడం జరిగింది. అనంతరం శ్రీ పైడి రాకేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఇంతమంది జన సందోహంలో గల్ఫ్ లో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సుమారు 1000 నుండి 1500 మంది ప్రజలు పాల్గొనడం జరిగింది .ఈ కార్యక్రమంలో ఇండియన్ పీపుల్స్ ఫోరం జాతీయ అధ్యక్షులు శ్రీ జితేంద్ర వైద్య, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కుంబాల మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు శరత్ గౌడ్, రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దీపిక,




కోర్ కమిటీ సభ్యులు నవనీత్ పటెల్ గాజా, అపర్ణ, అజయ్, జగదీష్, గోవర్ధన్ , డా.సౌజన్య, మదన్, వంశీ గౌడ్, కృష్ణమేగి, రాజు అడ్లగట్ట, కృష్ణ నిమ్మల, వేణుగోపాల్ రెడ్డి, రేండ్ల శ్రీనివాస్, డొక్కా శ్రీనివాస్, యోగేష్ , అశోక్ పెనుకుల తదితరులు పాల్గొనడం జరిగింది.

# ప్లాస్టిక్ రహిత పాత్రలతో అన్న ప్రసాద వితరణ

### దేవి మండపంలో పూజలు చేసిన ఎమ్మెల్సీ జీవన్, జడ్పీ మాజీ చైర్మన్ వసంత

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 8

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని రామాజీపేట శ్రీ నవ దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం మహా అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ ను నిర్మూలించాలని, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నెలకొల్పాలని ఆకాంక్షిస్తూ కమిటీ సభ్యులు పచ్చని విస్తరాకులు, స్టీల్ పాత్రలతో అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ పట్టభద్రులు ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి, జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో ప్లాస్టిక్ నివారించే విధంగా పచ్చని విస్తరాకులు స్టీల్ పాత్రలలో అన్న ప్రసాద వితరణ చేపట్టడం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం అభినందనీయమని, ప్రకృతిని ప్రేమించే విధంగా ప్లాస్టిక్ ను నిర్మూలించే విధంగా ఆధ్యాత్మిక భావన కల్పిస్తూ కమిటీ సభ్యులు అన్న ప్రసాద వితరణ చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, కార్యదర్శి మహేష్, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు కమిటీ సభ్యులు వాసరి రవి, బి.మోహన్, జకిలేటి హరీష్ రావు, ఆకుల మహేష్, కురుమ లింగారెడ్డి, నవదుర్గ సేవా సమితి కమిటీ సభ్యులు ఎనుగంటి పెద్ద లింబయ్య, బేతి మల్లారెడ్డి, ఇద్ధం సుధీర్ రెడ్డి, గుజ్జుల కిరణ్ రెడ్డి, శ్రీనివాసరావు,



ఎనుగంటి రవి, భరత్, విజయ్, గంగారెడ్డి, రాజేష్ , దీక్షా స్వాములు భూమేష్, వెంకటేష్, చంద్రపాల్, నరేష్ రణధీర్ నవీన్, భీమయ్య, యువజన సంఘాల సభ్యులు స్థానిక నాయకులు వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ పది సంవత్సరాల పాలన వికాసం.

### రేవంత్ రెడ్డి పది మాసాల పాలన విధ్వంసం

### మాజీ చైర్ పర్సన్ -దావ వసంత సురేష్

కాంగ్రెస్ ప్రభుత్వం 10నెలల మాసంలో తెలంగాణ రాష్ట్ర పరిస్థితి, జగిత్యాల జిల్లా పరిస్థితి పై రాయికల్ మండల కేంద్రంలో మీడియా తో మాట్లాడిన జగిత్యాల జిల్లా పరిషత్ తొలి చైర్ పర్సన్ దావ వసంతసురేష్ ...ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ:-పేదోళ్ల కడుపుకొడుతూ పెద్దోళ్ల కడుపునింపడానికి మూసి రివర్ ఫ్రంట్. రైతు రుణమాఫీ, రైతు బంధు, ఆసరా పెన్షన్ సహాయం పెంపు, కళ్యాణలక్ష్మి తులం బంగారానికి, ఫీజు రీయింబర్స్మెంట్ కు పైసల లేవు అన్న ప్రభుత్వానికి మూసినది రివర్ ఫ్రంట్ కి 1లక్ష 50వేల కోట్లు ఎక్కడివి..? కార్పొరేట్ కాలేజీలను తనిఖీ చేస్తున్న రాష్ట్ర మహిళ కమిషన్ ఒకసారి ప్రభుత్వ గురుకుల పాఠశాలలు ఎంత దారుణ పరిస్థితులలో ఉన్నాయో ఒకసారి వెళ్లి తెలుసుకుంటే వారి ఆవేదన అర్థమవుతుంది అన్నారు.జగిత్యాల జిల్లాకు గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ కేటాయించిన నిధులే తప్ప..ఇప్పటి ప్రభుత్వం నయా పైసా కేటాయించలేదు.ఆరు గ్యారెంటీలు కేవలం ఆర్భాటాలకే పరిమితమయ్యాయి.గత పది సంవత్సరాల్లో బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నామని, కానీ ఇప్పుడు ఆడపడుచులు బతుకమ్మ ఆడే ప్రదేశంలో కనీసం పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా జరుపలేని స్థితిలో నేటి ప్రభుత్వం ఉందన్నారు.ప్రజల ఆరోగ్యాన్ని, అభివృద్ధిని గాలికి వదిలేసిన్రు. పాలన గురించి కనీసం అవగాహన లేని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావడం దురదృష్టం..పేదల కడుపు కొట్టడం రేవంత్ రెడ్డి వంతు



ఐతే వారిని కడుపున పెట్టుకొని కాపుడుకున్న నాయకుడు కేసీఆరే నని గర్వంగా చెప్పుకుంటాం..దేవి నవరాత్రులలో భాగంగా అమ్మ వారిని దర్శించుకొని కాంగ్రెస్ నాయకులకు బిఆర్ఎస్ బిఫామ్ మిద గెలిచి పార్టీ మారిన నాయకులకు సిఎం రేవంత్ రెడ్డికి నిరుపేద ప్రజల పై వారి దృష్టి ఉండాలని, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించే విధంగా ముఖ్యమంత్రి కి జ్ఞానోదయం కల్పించాలని మా బిఆర్ఎస్ పార్టీ పక్షాన అమ్మవారిని వెడుకున్నామన్నారు..ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షుడు అనిల్, మండల మహిళ అధ్యక్షురాలు స్పందన, కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి, మహేష్ గౌడ్, సాయి, మహేందర్, రాయికల్ మాజీ ఏఎంసీ చైర్మన్ ఉదయ శ్రీ, మండల సమన్వయ కమిటీ సభ్యులు బర్కం మల్లేష్, దొంతి నాగరాజు, కంటి గంగారాం పాల్గొన్నారు.



## శ్రీ శివగంగ రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన చేవెళ్ల ఎంపీ కెవిఆర్, శ్రీరాములు అందెల

### - బిజెపి సభ్యత్వ నమోదు ద్వారా పార్టీ మరింత బలపడుతుంది - చేవెళ్ల ఎంపీ కెవిఆర్

మహేశ్వరం ప్రతినిది వార్త మిర్రర్ అక్టోబర్ 8 : మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని శ్రీ శివగంగ రాజరాజేశ్వరి ఆలయంలో లిచేవెళ్ల పార్లమెంట్ సభ్యులు బిజెపి పార్లమెంట్ విప్ కొండా విశ్వేశ్వర్ రెడ్డిలిరాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్లితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ బిజెపి సభ్యత్వ నమోదును చేయించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి రెడ్డి మాట్లాడుతూ బిజెపి సభ్యత్వ నమోదు ద్వారా పార్టీ గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు మరింత బలంగా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి గారు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పోతర్ల సుదర్శన్ యాదవ్, బీజేవైఎం అధ్యక్షులు వనంపల్లి శ్రవణ్, మాజీ జెడ్పీటిసి సభ్యులు అల్లే పద్మమ్మ శంకర్, అల్లంపల్లి మల్లేష్ కాకి పరమేష్, రాజు నాయక్, భాస్కర్, నరేష్, జంగయ్య, ప్రకాష్, నగేష్, నాగరాజ్, చింటూ, గణేష్, విజయ్, ఉమేష్, రాఘవేందర్, యాదయ్య, బిజెపి ,బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్

కల్వకుర్తి అక్టోబర్ 8 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన చిటికెల బాలమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది. ఈ విషయాన్నీ తుర్కలపల్లి గ్రామానికి చెందిన ఉప్పల వెంకటేష్ ట్రస్ట్ సభ్యుల ద్వారా తెల్సుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ మరియు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ స్పందించి తమ ట్రస్టు ద్వారా మృతురాలి కుటుంబానికి రూ”3000 (మూడు వేల రూపాయల) ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పల వెంకటేష్ ట్రస్ట్ సభ్యులు మరియు బిఆర్ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు దారమోని గణేష్, ఉపాధ్యక్షుడు వీరపాకుల నాగరాజు,బిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ ఐల శేఖర్ గౌడ్,చిటికెల శ్రీను,కోటయ్య,మెంట తిరుమల్లేష్, పరుషరాములు, తిరుపతయ్య,సైదులు , నరసింహ,రామస్వామి పాల్గొన్నారు.



## లాలాపేట్ జై దుర్గా భవాని అసోసియేషన్ అమ్మవారికి ప్రత్యేక పూజలు..... అన్నదాన కార్యక్రమాలు

సికింద్రాబాద్,వార్త మిర్రర్ అక్టోబర్ 8.... లాలాపేట్ బొడ్రాయి సమీపంలో

జై దుర్గా భవాని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారికి స్థానిక ప్రజలు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మంగళవారం ప్రత్యేక పూజలు చేసి అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలు..శ్రీ మహాలక్ష్మి గా దుర్గమ్మ.



కల్వకుర్తి అక్టోబర్ 8 వార్త మిర్రర్ ప్రతినిధి:– కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామంలో శరన్నవరాత్రులు అత్యంత కన్నుల పండగ సాగుతున్నాయి.ఉత్సవాలలో భాగంగా ఆరవ రోజు దుర్గమ్మ శ్రీ మహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు.అమ్మవారికి 5 లక్షల 116 రూపాయల కరెన్సీ నోట్లతో మండపాన్ని అలంకరించి అమ్మవారికి 100, 200,500 విలువైన కరెన్సీ నోట్లను దండలుగా కుచ్చి అమ్మవారి మెడలో పూలమాలగా అలంకరించారు.రెండు చేతుల్లో మాలలను ధరించి, అభయవరద హస్త ముద్రలను ప్రదర్శిస్తూ,గజరాజు సేవిస్తుండగా శ్రీ మహాలక్ష్మీ రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. పురాణాల ప్రకారం డోలా సురుడు అనే రాక్షసుడిని సంహరించి లోకాలకు శాంతి చేకూర్చింది అమ్మ"యాదేవీ సర్వభూతేషు లక్ష్మీ రూపేణి సంస్థితా"లోకంలోని అన్ని ప్రాణుల్లో లక్ష్మీ స్వరూపంలో ఉంటుందని చండీ సప్తశతి చెపుతోంది.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భజన కీర్తనలు,బతుకమ్మ, ఆటపాటలతో భక్తిశ్రద్ధలతో సందడి చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ మరియు దుర్గ మాత ఉత్సవ కమిటీ సభ్యులు,భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## హర్యానాలో ముచ్చటగా మూడోసారి అధికారాన్ని కైవసం చేసుకున్న బిజెపి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి అక్టోబర్ 08

భారతీయ జనతా పార్టీ చౌటుప్పల మున్సిపల్ మండల శాఖ అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, చినుకని మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ బస్టాండ్ ప్రాంగణంలో హర్యానాలో ముచ్చటగా మూడోసారి బిజెపి అధికారాన్ని కైవసం చేసుకోవడం జరిగింది.జమ్మూ కాశ్మీర్లో అత్యధిక స్థానాలు బిజెపి గెలవటాన్ని హర్షిస్తూ మిఠాయిలు పంచుతూ, టపాకాయలు పేలుస్తూ హర్షాతిరేఖాలు వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో దూడల బిక్షం గౌడ్,రమణగొని శంకర్, గుజ్జుల సురేందర్ రెడ్డి ,ఆలే నాగరాజు, బాతరాజు సత్యం,దాసోజు బిక్షమాచారి, ఉడుగు వెంకటేశం,కాసుల వెంకటేశం, కట్ట కృష్ణ, ఉబ్బు బిక్షపతి, ఉప్పు ఆంజనేయులు, కాడవేరు పాండు, వనం ధనుంజయ, లగోని పాండు, గుర్రం రవీందర్, అమృతం దశరథ, కాయితి ముత్యాలు, పర్ని శ్రీనివాసరెడ్డి, నల్ల శివప్రసాద్, చికూరి వెంకటేశం, రాజపేట వెంకటేశం, బండారు మహేందర్ రెడ్డి, పోలోజు భాస్కర్, పబ్బతి శేఖర్ గౌడ్, భాతరాజు లింగస్వామి తదితరులు పాల్గొనడం జరిగింది




## లాలాపేట్ మంజరి నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు... అన్నదాన కార్యక్రమాలు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ అక్టోబర్ 8... దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా లాలాపేట్ మంజరి నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పూజలు, హోమాలు నిర్వహించడంతో పాటు నిత్యం వందలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ట్రాఫిక్ సుల్తాన్ బజార్ ఏసిపి సంపత్ కుమార్, డాక్టర్ ఆంజనేయులు ప్రారంభించారు.



## శ్రీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో గరుఢ వాహనంపై స్వామివారి తిరు వీధి ఉత్సవం

ఎల్బీనగర్ 8 అక్టోబర్ వనస్థలిపురం, సచివాలయ నగర్ కాలనీ లోని శ్రీ శ్రీ శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తిరుమల తిరుపతి లోని శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను తలపించే విధంగా జరుగుతున్న వేడుకలలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం మంగళ వాయిద్యాలు, సుప్రభాత సేవ, సువర్ణ పుష్పార్చన , ఉత్సాహమూర్తులకు అభిషేకం, తిరువీధి ఉత్సవం, శ్రీవారి కళ్యాణ మహోత్సవం, అన్నదాన కార్యక్రమం, సాయంత్రం పుర వీధులలో గరుడ వాహనంపై స్వామి వారి తిరువీధి ఉత్సాహం, బ్రహ్మశ్రీ పసర్లపాటి శ్రీనివాస బంగార శర్మ చే ప్రవచనాలు, వేద పండితుల తో వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ చైర్మన్ రంగినేని వెంకట్రావు, ఆలయ కమిటీ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పి. సత్యనారాయణ, కో చైర్మన్ కే ఎల్ గణపతి, వైస్ చైర్మన్ లు జగదీష్ కుమార్, బీవీ పాపారావు, కే. సత్తయ్య, కోశాధికారి శ్రీధర్, సహ కోశాధికారి రామలక్ష్మి, జాయింట్ సెక్రటరీ పి.శ్యామల, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే. సాంబశివరావు,కార్యవర్గ సభ్యులు పి సునీల్ కుమార్ గౌడ్,వెంకటేశ్వరరావు, టీవీ రమేష్ బాబు,అశోక్ కుమార్, సలహాదారులు యు. సూర్యనారాయణ, ఎస్.లక్ష్మీనారాయణ, ఈ.చంద్రశేఖర్ రెడ్డి, ఏం. జయ సూర్య, యు అనూప్ కుమార్ ల పర్యవేక్షణలో భక్తుల సౌకర్యార్థం చక్కటి ఏర్పాట్లను చేశారు.

# ప్రమాదం లో మృతి చెందిన గల్ఫ్ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 8

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెధిర గ్రామానికి చెందిన సామల రాజు అనే యువకుడు బైక్ అదుపుతప్పి ఆక్సిడెంట్ లో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడు కొంతకాలంగా గల్ఫ్ లో పనిచేసి స్వగ్రామం వచ్చాడు. కుటుంబంతో కొన్ని రోజులు గడిపి గల్ఫ్ తిరిగి రావడానికి ఎన్నో ఆశలతో వెళ్లిన అతను అకాల మరణం వల్ల కుటుంబం పెద్ద దిక్కు కోల్పోవడం జరిగింది. ఇతనికి ముగ్గురు చిన్న పిల్లలు, భార్య, తల్లి, తండ్రి వృద్ధాప్యంలో ఉన్నారు. కడుపేద కుటుంబమైన వీరికి దుబాయ్ ఎల్లాల శ్రీను అన్న సేవాసమితి సీనియర్ సభ్యుడైన కొండపత్రి నరేష్ బావమరిది కావడం విశేషం. నరేష్ వెంటనే స్పందించి వాళ్ళ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండి ఆదుకుంటూ మా దుబాయ్ ఎల్లాల శీనన్న సేవాసమితి ద్వారా ఆర్థిక సహాయాన్ని కోరాడు. వెంటనే స్పందించిన సేవాసమితి అధ్యక్షులు రవి డేవిడ్బీ ఉపాధ్యక్షులు బాలు బొమ్మిడి. సామాజికవేత్త డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి కి ఈ విషయం తెలియజేసి సేవ సమితి నుండి ఆర్థిక సహాయంగా 20 వేల రూపాయలు అందించడం జరిగింది. ఈరోజు మా దుబాయ్ ఎల్లాల శ్రీనన్న సేవాసమితి వ్యవస్థాపకులు నేరువట్ల బాబు స్వామి, సేవాసమితి ప్రధాన కార్యదర్శి చిలుముల రమేష్, మాజీ అధ్యక్షులు రవి ఉట్నూరి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఇందులో మా సేవా సమితి సభ్యులు ఆపద ఉందంటే ముందుండి ఎందరికో సహాయ సహకారాలు అందిస్తూ సేవా గుణాన్ని చాటుతున్నారు.... ఈ సందర్భంగా గల్ఫ్ నుండి వెళ్ళిన ప్రతి ఒక్కరు తమకు తాముగా జాగ్రత్తలు పాటిస్తూ కుటుంబంతో సంతోషంగా గడిపి తిరిగి



ఉద్యోగంలో చేరాలని కోరుకోవడం జరిగింది. గల్ఫ్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని ఈ సందర్భంగా వేడుకోవడం జరిగింది. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు..ఇంకా దాతలు ముందుకొచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాం అన్నారు.



## ఘనంగా కుంకుమ పూజ మహా అన్న ప్రసాద వితరణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 8

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని చారిత్రక గుడి కోట ఆవరణలో చండీ పరివార్ ఆధ్వర్యంలో దుర్గ మాత నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు మహాలక్ష్మి దేవి అవతారంలో దర్శనమివ్వగా భక్తులు, మాతలచే అర్చకులు మునుగోటి సాయి సుధీర్ సారథ్యంలో వేదమంత్రాల సాక్షిగా అమ్మవారిని శృతిస్తూ కుంకుమ పూజ నిర్వహించగా 200 పైగా మహిళలు అమ్మవారి పూజా సేవలో పాల్గొని తరించారు. అనంతరం నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో దాదాపు రెండు వెయ్యిల పైగా భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. పండుగ శోభగా ఉట్టిపడేలా అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్న చండీ పరివార్ బృంద సభ్యులను పలువురు అభినందించారు.



## శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ప్రాంగణంలో కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి అక్టోబర్ 08

చౌటుప్పల్ మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దేవాలయంలో మహిళాచే కుంకుమార్చన కార్యక్రమం అన్నదాన కార్యక్రమం ఎంతో ఘనంగా చేయడం జరిగింది.దేవాలయ ప్రాంగణంలో మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి చేతులతో మొక్కలు నాటడం జరిగినది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలంగౌడ్, కౌన్సిలర్ కొరగోని లింగస్వామి,సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి,దేవాలయ అధ్యక్షుడు సురుకంటి మహేందర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి సంజయ్ బాబు,బడుగు మాణిక్యం, సుర్కంటి కనకా రెడ్డి, కానుగు శేఖర్ ముదిరాజు, ఉప్మాగుల రమేష్, చింతల సుధాకర్, పాలడుగు వెంకటేశం, పిల్లలమర్రి మధుసూదన్, శ్రీనివాస్ రెడ్డి, గట్టు పవన్, అనురాధ, రామిరెడ్డి, ఉయ్యాల పల్లవి, సిల్వేరు శ్రీశైలం, మనుకుంట్ల జంగయ్య, రాంప్రసాద్ డాక్టర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేసినారు






## ప్రవక్త హజరత్ మహమ్మద్ పై అనుచిత వ్యాఖ్యలకు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

మిర్యాలగూడ అక్టోబర్ 8:–( వార్త మిర్రర్) అంతిమ ప్రవక్త హజరత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)పై అనుచిత వ్యాఖ్యలు చేసిన యతినరసింగానంద్ సరస్వతిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం జమైతే ఉల్మాయే హింద్ మిర్యాలగూడ శాఖ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మస్జిద్ అరాఫత్ నుండి జాతీయ పతాకాలు చేతబూని నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని, న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ సాగర్ రోడ్డు, రాజీవ్ చౌక్, కలాల్ వాడ గుండా సబ్ కలెక్టరేట్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రవక్త జీవితాన్ని ముస్లైనీతారులు ఆదర్శ జీవితమని పేర్కొనగా కొంతమంది ప్రవక్తను కించ పరిచే విధంగా మాట్లాడటం దారుణమని సహించారానిదని అన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ముఫ్తీ మొహమ్మద్ ఇమ్రాన్, ముఫ్తీ సలీం ఇస్హాక్, మౌలానా ఇద్రిస్, మిలాద్ కమిటీ అధ్యక్షుడు ఎం.ఎ. సమీఖాద్రీ, ఎఐఎంఐఎం జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్ ఫారూఖ్, కౌన్సిలర్లు ఎం.ఎ.సలీం ఖాద్రి, ఎండీ. జాని క్రికెటర్, మోయిజ్, యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్ అజహర్, అఫ్జల్, బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి ఎండీ. షోయెబ్, బిఆర్ఎస్ పట్టణ కార్యదర్శి ఎండీ. గయాస్, అవాజ్ నాయకులు ఎండీ.ఆంజద్, బిఎంపి పట్టణ అధ్యక్షుడు ఎండీ. మోహ్సిన్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా రమేష్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి అక్టోబర్ 8

జగిత్యాల జిల్లా రాయికల్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పొన్నం రమేష్ గౌడ్, అల్లీపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బొమ్మకంటి రవికుమార్ లను పిఆర్టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గా నిమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద్ రావు, అమర్నాథ్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర కార్యదర్శులు గా గాజంగి రాజేశం, లక్కడి రాజారెడ్డి లు ఎన్ని ఎన్నికైనట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ కి ఎన్నిక కావటం పట్ల రాయికల్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అంతడుపుల గంగారాజం, రాపర్తి నర్సయ్య, కార్యదర్శి చెట్పల్లి బాపు రావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కన్నావేని మల్లారెడ్డి, కార్యదర్శి దొంతి సతీష్, కడకుంట్ల అభయ్ రాజ్, ఊసకోలా రాము, సిలివేరి రమేష్ లు అభినందించారు.



## కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు మాజీ స్పీకర్ మధుసూదనా చారి

ఎల్బీనగర్,,8 అక్టోబర్ శ్రీదేవి శరన్నవరాత్రుల దసరా ఉత్సవాలను పురస్కరించుకొని వనస్థలిపురం ప్రశాంతి నగర్ కాలనీలోని శ్రీ కనకదుర్గా అమ్మవారి ఆలయముకి మంగళవారం శాసనమండలి ప్రతిపక్ష నేత, తెలంగాన తొలి మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనా చారి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ 16 వార్షికోత్సవం సందర్భంగా మహాలక్ష్మి దేవి హోమము లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సమ్ రెడ్డి భుజంగారెడ్డి,ప్రధాన కార్యదర్శి పిన్నింటి పద్మారెడ్డి,కోశాధికారి కొండ వీరేశలింగం, గౌరవ అధ్యక్షులు బూడిద యుగంధర్ రెడ్డి,కన్వీనర్ రామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ విజయ్ అగర్వాల్, జగదీశ్వర్, జగన్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఉపాధ్యాయ ఎంపిక పత్రాల జారీలో ఉద్యోగులకు ఇవ్వవలసిన డిఏ ను సిఎం ప్రకటించాలి - బంజారా ఉద్యోగుల సంఘం కన్వీనర్ దశరథ్ నాయక్

మిర్యాలగూడ, అక్టోబర్ 8:–( వార్త మిర్రర్) నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు జారీ చేయనున్న ఎంపిక పత్రాల జారీ కార్యక్రమం బుదవారం ఎల్బీ స్టేడియం లో జరనుండగా ఆ కార్యక్రమం సందర్భంగా నైనా సిఎం ఉద్యోగ,ఉపాధ్యాయులకు రావల్సిన డీర్నెస్ అలవెన్సులు గురించి ప్రకటన చేసి ఉద్యోగ,ఉపాధ్యాయుల్లో దసరా పండగ ఆనందం కల్పించాలని బంజార ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్ కోరారు.మంగళవారం విలేఖర్లతో మాట్లాడుతూ 2022 నుండి రావల్సిన డిఎ గురించి ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. రెండేండ్ల నుండి డిఎ తో పాటు 2023 జూన్ నుండి పీఆర్సి అమలు గురించి ఆశతో వున్నట్లు చెప్పారు.ఉద్యోగ పక్షపాత ప్రభుత్వమైనా సిఎం హాయంలో పెండింగ్ బిల్లులు ఇతర సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రకటన చేయాలని సూచించారు.సమావేశంలో మక్లా నాయక్,రవి,శ్రీను,రమేష్,గోపాల్,లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.




## హర్యానాలో బిజెపి హవా విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కెవిఆర్ ,శ్రీరాములు అందెల

మహేశ్వరం ప్రతినిధి వార్త మిర్రర్ అక్టోబర్ 8 : మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో హర్యానాలో జరిగినటువంటి అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ వరుసగా మూడోసారి విజయం సాధించడంతో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు, బిజెపి పార్లమెంట్వి కొండా విశ్వేశ్వర్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ తో కలిసి విజయోత్సవ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ హర్యానా ప్రజలు డబల్ ఇంజన్ సర్కార్ను కోరుకున్నారని డబుల్ ఇంజన్ సర్కార్ తో హర్యానా రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడారి జంగయ్య యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పోతర్ల సుదర్శన్ యాదవ్, బీజేవైఎం అధ్యక్షులు వనంపల్లి శ్రవణ్, మాఫీ జడ్పిటిసి సభ్యులు అల్లే పద్మమ్మ శంకర్, అలంపల్లి మల్లేష్, కాకి పరమేష్ సుజాత, రాజు నాయక్, భాస్కర్, నరేష్, జంగయ్య, ప్రకాష్, నగేష్, నాగరాజు, చింటూ, గణేష్, విజయ్, ఉమేష్, రాఘవేందర్, యాదయ్య, బిజెపి మరియు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

## టెలిఫోన్ అడ్వైజరీ సభ్యులుగా రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి

### -నామినేటెడ్ ఉత్తర్వులు ఇచ్చిన బీఎస్ఎన్ఎల్

### -బడంగ్ పేటకు దక్కిన అరుదైన గౌరవం



రంగారెడ్డి జిల్లా ( వార్త మిర్రర్ ప్రతినిధి )= అక్టోబర్ 8 :....హైదరాబాద్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా రాళ్లగూడెం రామకృష్ణారెడ్డిని బీఎస్ఎన్ఎల్ నియమించింది. ఈ నామినేటెడ్ పదవిలో 13-07-2026 వరకు ఆర్కే కొనసాగనున్నారని ఉత్తర్వుల్లో పేర్కొంది. కేంద్ర సంస్థలో నామినేటెడ్ పదవి దక్కడంపై రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ గౌరవం బడంగ్ పేట కార్పొరేషన్ కు దక్కినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి , బండి సంజయ్ చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్చార్జి అందెల శ్రీరాములు యాదవ్ కు ధన్యవాదములు తెలిపారు.ఈ పదవిని బాధ్యతగా భావించి భవిష్యత్ లో.ప్రభుత్వ రంగసంస్థ బీఎస్ఎన్ఎల్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## అమెరికా టెక్సాస్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

### బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ లక్కరాజు నిర్మల

సికింద్రాబాద్, వార్త మిర్రర్ అక్టోబర్ 8 ... ఇటీవల అమెరికా పర్యటనలో భాగంగా టెక్సాస్ కు వెళ్లిన అవాకేర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డాక్టర్ లక్కరాజు నిర్మలకు ఆత్మీయ అభిమానం లభించింది. ఈ సందర్భంగా టెక్సాస్ లో నివసిస్తున్న పలువురు తెలుగు మహిళలు ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథులుగా హాజరై బతుకమ్మ ఆడి పాడారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక పండుగ బతుకమ్మ గురించి వారికి అవగాహన కల్పించారు. అమెరికా టెక్సాస్ లోని సెలీనాలో ఉన్న డాక్టర్ లక్కరాజు నిర్మల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్కరాజు నిర్మల మాట్లాడుతూ దసరా బతుకమ్మ పండుగలను ఘనంగా అమెరికాలో ఉన్న భారతీయులందరూ సంప్రదాయాలను కాపాడాలని మన సంస్కృతిని రేపటి తరానికి తెలపాలని ఆటపాటలతో సంతోషంగా బతుకమ్మలాడారు.

## మధ్యవర్తి మోసం చేశాడు.. రక్షించండి ..

### ఇరాక్‌లో సారంగాపూర్ యువకుడి ఆవేదన



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిది అక్టోబర్ 8

జగిత్యాల జిల్లా కు చెందిన ఓ యువకుడు ఇరాక్ లో చిక్కుకుని నరకయాతన అనుభవిస్తున్నాడు. ఆ యువకుడి ఆవేదనకు సంబంధించిన సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. వివరాల్లోకి వెళితే జగిత్యాల జిల్లా సారంగపూర్ గ్రామానికి చెందిన అజయ్ అనే యువకుడు ఉపాధి కోసం ఇరాక్ దేశానికి వెళ్లాడు. అధిక వేతనం ఇప్పిస్తానని చెప్పిన ఏజెంట్ మాటలు నమ్మి, అతనికి రూ. 2.70 లక్షలు ఇచ్చానని చెప్పాడు. ఇక్కడికి వచ్చాక ఏజెంట్ తనని మోసం చేసి, పాస్ పోర్ట్ తీసుకొని ఒక గదిలో బందించి వెళ్లాడని తెలిపాడు. తినడానికి తిండి కూడ లేదని, రోజుకు ఒక పూట మాత్రమే తింటున్నానని, అది కూడా లేకపోతే పస్తులు ఉంటున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇక్కడ ఉండలేక పోతున్నానని, తనని ఎలాగైనా స్వదేశానికి తీసుకొని వెళ్లాలని వేడుకుంటున్నాడు. దీనిని సెల్ఫీ వీడియో తీసి నెట్టింట పోస్ట్ చేయడంతో ఈ వీడియో వైరల్ అయ్యింది. దీనిపై స్పందించి.. ఆ యువకుడిని ఇండియా తీసుకొని రావాలని నెటిజన్లు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సహా పలువురిని ట్యాగ్ చేస్తున్నారు. అంతేగాక ప్రభుత్వం చొరవ చూపి తమ కుమారుడిని స్వదేశానికి తీసుకురావాలని బాధితుడి తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



## టీచర్స్ కాలనీ పేస్ 2 లోని రోడ్డు పనులను నిర్మాణం త్వరలోనే చేయబడతాం

### - కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాలనీవాసులకు హామీ

ఎల్బీనగర్,8 అక్టోబర్ బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేస్ 2 లో రోడ్లు మరియు భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ నూతన నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు బి.యన్ రెడ్డి నగర్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ని కోరారు. అట్టి రోడ్డును మంగళవారం కాలనీ సభ్యులతో కలసి పర్యవేక్షించి, గేదెల షెడ్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పలుమార్లు చెప్పినా యజమానులు పట్టించు కోవడం లేదని మురుగునీరు, పేడ వాటి వ్యర్థ పదార్థాలు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో నింపడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందని చెప్పారు. దీనితో దోమల బెడదతో ఇబ్బందులు కలుగుతున్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్ కి ఫిర్యాదు చేశారు. వెంటనేస్పందించిన కార్పొరేటర్ తక్షణమే సంబంధిత రోడ్డు మరియు భూగర్భ డ్రైనేజ్ పనులు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని, త్వరలోనే నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. బర్రెల షెడ్ యజమానితో మాట్లాడి కాలనీ సభ్యులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని, శుభ్రతగా ఉంచుకునే బాధ్యత తీసుకోవాలని పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో చైతన్య నగర్ కాలనీ అధ్యక్షులు జలంధర్ రెడ్డి, టీచర్స్ కాలనీ ఫేస్ 2 అధ్యక్షులు శివ ముదిరాజ్, టీచర్స్ కాలనీ పేస్ 3 అధ్యక్షులు సాయి రెడ్డి, మరియు ఉపాధ్యాయుల మోర్చ కన్వీనర్ భూపాల్ రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి,నరసింహారెడ్డి, మహిపాల్ రెడ్డి, మరియు తదితరులు పాల్గొన్నారు.

## తాటికోల్ లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

### యశోద ఆసుపత్రి వైద్యులచే మెగా ఉచిత వైద్య శిబిరం





దేవరకొండ అక్టోబర్ 08 వార్త మిర్రర్ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు దీర్ఘకాలిక వ్యాధులతో పాటు మోకాళ్ల నొప్పులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ మెరుగైన వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్న వారికోసం లయన్స్ క్లబ్ యశోద మలక్ పేట ఆసుపత్రి వైద్యులచే మంగళవారం నాడు దేవరకొండ మండలంలోని తాటి కోల్ గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని రాష్ట్ర సర్పంచుల ఫోరం మహిళా అధ్యక్షురాలు, టిపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యురాలు, భారత్ జోడో యాత్రి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్రామ మాజీ సర్పంచ్ జూలూరు ధనలక్ష్మి బాలనారాయణగౌడ్, తిప్పర్తి రుక్మారెడ్డి, సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు వస్కుల సత్యనారాయణ తెలిపారు. 300 మంది పైగా మోకాళ్లు, కంటి,గుండె, షుగర్ ,బిపి పరీక్షలు నిర్వహించారు. పల్లెల్లో మొదలుకొని పట్టణాల వరకు అన్ని రకాల జబ్బులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతోపాటు వైద్యాన్ని చేరువ చేస్తున్నామని నేటి పరిస్థితుల్లో కార్పొరేట్ లాంటి వైద్యం అందుకోలేని పేదలకు అత్యధిక అత్యాధునికమైనటువంటి పరికరాలతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బోన్ డెన్సిటీ టెస్టులు సైతం అందుబాటులోకి తీసుకొచ్చి గ్రామంలో కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించామని గ్రామ మాజీ సర్పంచ్ జూలూరు ధనలక్ష్మి బాల నారాయణ గౌడ్ మాట్లాడుతూ కీళ్లనొప్పులు తో బాధపడుతున్న వారికి యశోద ఆసుపత్రి వైద్యులు లయన్స్ క్లబ్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. క్లబ్ తరఫున ఉచితంగా మందులు అందజేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వస్కుల సత్యనారాయణ, జోన్ చైర్మన్ వనం బిక్షమయ్య, ప్రధాన కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి నిరంజన్, గాజుల రాజేష్, వనం శ్రీనివాస్, శిరందాసుకృష్ణయ్య, నల్ల మాద నారాయణరెడ్డి, గోవిందు కొండయ్య, గుద్దేటి జంగయ్య, , నారాయణ సింగ్, సముద్రాల శ్రీనివాసులు,తిప్పర్తి రుక్మారెడ్డి,లకుమారపు మల్లయ్య మాజీ ఎంపీటీసీ జూలూరు అంజయ్య, జూలూరు గిరిప్రసాద్ ,జూలూరు అంజయ్య, కనకాచారి ఎరుకల అశోక్ గౌడ్ ,దొంతినేని వెంకటరమణా, పల్సర్ కృష్ణయ్య, ఉపసర్పంచ్ రవి, పల్చ కొండయ్య ,తదితరులు పాల్గన్నారు.

## విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనం

విశాఖపట్నం వార్త మిర్రర్ మధ్యాహ్న భోజన పథకం సమీక్షలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్మెనూపై పిల్లల అభిప్రాయం తీసుకోవాలని, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఆదేశాలు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనం పెట్టాలని, వారు ఇష్టపడి తినేలా తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమలు, నిర్వహణ తీరుపై మంగళవారం కలెక్టరేట్ మీటింగు హాలులో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పథకాన్ని మరింత పక్కాగా అమలు చేయాలని, మెనూ విషయంలో పిల్లల అభిప్రాయాలు తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలని హితవు పలికారు. సమావేశంలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. చంద్రకళ జిల్లాలో పథకం అమలు గురించి వివరాలు వెల్లడించారు. 581 పాఠశాలల్లో పథకం అమలవుతుందని, వాటిలో 315 పాఠశాలలకు అక్షయ పాత్ర, మరొక 266 పాఠశాలలకు కుకింగ్ ఏజీన్సీ ద్వారా ఆహారం అందిస్తున్నామని వివరించారు. 97.5 శాతం ఫలితాలను సాధిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన భోజనం అందించే విషయంలో రాజీ పడొద్దని, పరిమాణం తగ్గించవద్దని అధికారులకు సూచించారు. పోషకాలతో కూడిన ఆహారం మెనూ ప్రకారం అందజేయాలని చెప్పారు. ఉదయాన్నే తప్పకుండా రాగిజావ అందజేయాలని, మధ్యాహ్నం ఇంటర్వెల్ తర్వాత చిక్కీ ఇవ్వాలని సూచించారు. రోజుకొక మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయాలని, పిల్లలు ఆహారాన్ని వృథా చేయకుండా పీఈటీలు దగ్గరుండి పర్యవేక్షించాలని చెప్పారు. ఆహారం వండే పరిసరాల్లో శు



భ్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధ్యాయులు, స్పెషల్ అధికారులు, తనిఖీ బృందాల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని నిర్వహణ లోపాలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఆహారం తయారు చేసే ఏజేన్సీలకు నాణ్యమైన సరకులు అందజేయాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. కిచెన్ గార్డెన్ విధానాన్ని ప్రోత్సహించాలని, విద్యార్థులకు హెల్త్ స్క్రీనింగ్ టెస్టులు తరచూ చేయాలని సూచించారు. సమావేశంలో డీఈవో ఎల్. చంద్రకళ, జడ్పీ సీఈవో నారాయణమూర్తి, ఐసీడీఎస్ పీడీ జయదేవి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రామారావు, డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారి నవరాత్రి ఉత్సవాల వల్ల ప్రజలలో భక్తి భావం పెంపొందుతుంది: డాక్టర్ శ్వేత ప్రియాంక - సుధీర్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి అక్టోబర్ 08

అమ్మ వారి నవరాత్రి ఉత్సవాల వల్ల ప్రజలలో భక్తి భావం పెంపొందుతుందని డాక్టర్ శ్వేత ప్రియాంక - సుధీర్ అన్నారు. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చౌటుప్పల్ మండల కేంద్రంలోని గాంధీ పార్క్ లో శ్రీ దుర్గా మాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అమ్మవారి మండపం వద్ద మంగళవారం రోజున డాక్టర్ శ్వేత ప్రియాంక - సుధీర్ చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు అమ్మవారి మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తనంతరం డాక్టర్ శ్వేత ప్రియాంక - సుధీర్ మాట్లాడుతూ దసరా నవరాత్రి ఉత్సవాల వల్ల ప్రజలలో ఆధ్యాత్మికత చింతనతో పాటు భక్తి భావం నెలకొంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా దేవి కమిటీ అధ్యక్షుడు ముత్యాల హనుమంత్ రెడ్డి, శివాజీ యూత్ అధ్యక్షుడు గుజ్జల సురేందర్ రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్, కౌన్సిలర్ తాడూరి శిరీష, బోడిగే బాలకృష్ణ, తాడూరు పరమేష్, ముత్యాల భూపాల్ రెడ్డి, సంద గళ్ళ నాగరాజు, ఢిల్లీ శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు..



## అక్కంపల్లి నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ లు మంజూరు చేయాలి

పీ. ఏ.పల్లి అక్టోబర్ 08 వార్త మిర్రర్ ::అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గురైన నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం చేపట్టి ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఏ పల్లి మండలం అక్కంపల్లి గ్రామపంచాయతీ లోని ఎన్టీఆర్ కాలనీ సిపిఎం గ్రామ శాఖ సభలో కంబాలపల్లి ఆనంద్ మాట్లాడుతూ అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ముంపు గురై దాదాపు 22 సంవత్సరాలు అవుతున్న ప్రభుత్వం నుండి రావలసిన బెనిఫిట్స్ రాకపోవటం వలన బ్యాలెన్స్ రిజర్వాయర్ కట్టకింద నివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాం బెనిఫిట్స్ కొరకు హైకోర్టు కేసు వేసిన కొంతమందికి బెనిఫిట్స్ రావడం జరిగింది. ప్లాట్ ఇవ్వటం జరిగింది సరి అయిన నష్టపరిహారం రాకపోవడం వలన ఇల్లు నిర్మాణం చేపట్టుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఎక్కువ శాతం ఎస్సీ కుటుంబాలకు చెందినవారుఇప్పటికైనా ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇస్తామన్న ఎన్నికలహామీని తక్షణమే అమలు చేసి వారికి న్యాయం చేయాలని కోరారు.ఈ మహాసభ అనంతరం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది శాఖ కార్యదర్శిగా మండలి రాజశేఖర్ కమిటీ సభ్యులు మండలి యుగంధర్ ముసలయ్య రాంబాబు లక్ష్మమ్మ రమణ స్వర్ణ రాములమ్మ రమాదేవి మాధవి ఏకగ్రీవం ఎన్నుకోవడం జరిగింది.



## ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని అధికారులు మౌలిక వసతులు కల్పించాలి

### - ఎడిఎ దేవ్ సింగ్

మిర్యాలగూడ , అక్టోబర్ 8:-( వార్త మిర్రర్) ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇంచార్జీలు రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు శ్రద్ధ చూపాలని స్థానిక వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, మండల పరిషత్ ప్రత్యేక అధికారి బి. దేవ్ సింగ్ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని రైతు వేదికలో నిర్వహించిన సంయుక్త సమావేశంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, మండల పరిషత్ ప్రత్యేక అధికారి బి.దేవ్ సింగ్ ఐకెపి కేంద్రాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనల మీద సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ ఏడీఏ మాట్లాడుతూ దాన్యం కొనుగోలు కేంద్రాలు ఎత్తైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పన, 30 టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీటి సదుపాయం రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలను గురించి సన్నరకం ధాన్యం, దొడ్డు రకం ధాన్యాన్ని వేరువేరుగా రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కలగకుండా ఉండాలని కోరారు. గ్రేడ్ ఎ ధాన్యం క్వింటాల్ ధాన్యం మద్దతు ధర రూ. 2,320లు, సాధారణ రకం ధాన్యం ధర రూ. 2,300లు ఉందని అన్నారు. తేమ 17శాతం లోపు, తాలు 1 శాతం, తయారు కానీ ధాన్యం 3 శాతం, రంగుమారిన, పగిలిన ధాన్యం 5 శాతం లోపు ఉండాలని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఓ ఎం. శేషగిరిశర్మ, ఎంపీఓ మాతంగి రమేష్, ఏపిఎంలు కృష్ణమూర్తి, శేషయ్య, సిసి, ఏఈఓలు షఫీ, రమేష్, బిందు, గోపి, ఆఫ్రిన్ పాల్గొన్నారు



## స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు గ్రామ సహాయకులు పనిచేయాలి

మిర్యాలగూడ అక్టోబర్ 8:- (వార్త మిర్రర్) ప్రజానీకానికి మెరుగైన తాగు నీరు అందించేందుకు గ్రామసహాయకులు పని చేయాలని ఆర్డబ్లుఎస్(మిషన్ భగీరథ) శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వెంకట్ రెడ్డి, ఎండీ. అన్వర్ లు కోరారు. మంగళవారం ఆర్ డబ్లు ఎస్ నుండి నియమింపబడ్డ గ్రామ మంచినీటి సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మెయిన్, డెలివరీ పైప్ లైన్లు తరచుగా లీకేజీలను వెంటనే గమనించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. హ్యాండ్ బోర్లు చెడి పోతే మరమ్మతులు చేసే విధానం చూపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.శేషగిరిషర్మ, ఎంపీఓ మాతంగి రమేష్, ఏఇఇలు మౌనిక. ఉమామహేశ్వరి, సిబ్బంది క్రాంతికుమార్, మధు, బ్రహ్మాచారిలు పాల్గొన్నారు.

# వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన సిహెచ్ శ్రీనివాస రావు

ఎల్బీనగర్, 8 అక్టోబర్ వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా ఎల్బీనగర్ సిసిఎస్ నుండి బదిలీపై వచ్చిన 2004 బ్యాచ్ కి చెందిన సిహెచ్ శ్రీనివాసరావు మంగళవారంపదవి బాధ్యతలు స్వీకరించారు.వనస్థలిపురం ఇన్స్పెక్టర్ గా పని చేసిన వై.అశోక్ రెడ్డి సైబర్ క్రైమ్ కు బదిలీపై వెళ్లారు.ఇన్స్పెక్టర్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు గతంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పలు కీలక పోలీస్ స్టేషన్ ల ఎస్ హెచ్ ఓ గా పని పని చేసి శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో చక్కగా పనిచేసే ఉన్నత అధికారులతో శభాష్ అనిపించుకొని ఆ ప్రాంత ప్రజల మన్ననలు పొందారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ పోలీస్ శాఖ ఉన్నత స్థాయి అధికారుల సలహా సూచనలతో మరింత పటిష్టంగా పనిచేస్తానని శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి పోలీస్ పరంగా ఎలాంటి న్యాయం కావాలన్నా నేరుగా పోలీస్ స్టేషన్ కానీ, స్టేషన్ ఫోన్ నెంబర్ కానీ సమాచారం ఇచ్చి శాంతిభద్రతల పరిరక్షణ కోసం అన్ని విధాల పోలీసులకు సహకరించాలని సూచించారు.



# ఘనంగా బతుకమ్మ ప్యామిలీ డే ఆట పాట వేడుకలు

మందమర్రి అక్టోబర్ 8: వార్త మిర్రర్ ప్రతినిధి సింగరేణి సంస్థ ఆద్వర్యంలో బతుకమ్మ ప్యామిలీ డే ఆట పాట వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏరియాలోని సిఈఆర్ క్లబ్ లో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ జి దేవేందర్, ఏరియా సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపరాణి-దేవేందర్ లు ముఖ్య అతిధులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సద్దుల బతుకమ్మ వేడుకల్లో అందరు కుటుంబ సభ్యులు ఒక్క దగ్గర చేరి ఆహ్లాదంగా గడపాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా ఈ వేడుకలలో భాగంగా నిర్వహించిన బతుకమ్మ ఆట,పాట, నృత్య పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం రాజేశ్వర్ రెడ్డి, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్,డివై పిఎం ఎండి ఆసిఫ్ అన్ని గనుల ప్రాజెక్ట్ అధికారులు, మేనేజర్లు, సంక్షేమాధికారులు, మహిళలు,సేవా సమితి సభ్యులు, లేడీస్ క్లబ్ సభ్యులు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





## దసరా పండుగ సందర్భంగా జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ, అక్టోబర్ 8:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బిఎల్ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ను మంగళవారం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో కలసి వాలిబాల్ ఆడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో క్రీడలు అంతరించి పోతున్నాయన్నారు. శారీరక దారుఢ్యంతో పాటు మానసిక నైపుణ్యం పెంచే క్రీడలను యువకులకు నేర్పించాలన్నారు.తద్వారా యువకులు బలంగా ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు. సామాజిక మాధ్యమాలకు బానిసలవుతున్న విద్యార్థులను ఇలాంటి క్రీడలపై తమ దృష్టిని మల్లించాలని తల్లి తండ్రులను, పాఠశాలలను కోరుతున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డి.స్కైలాబ్ నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, జిల్లా వాలీబాల్ క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక చారి వెంకన్న, లక్ష్మణ్, క్రీడాకారులు, కాంగ్రెస్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



## చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేయకూడదు సంఘ విద్రోహ శక్తులకు సహకరించకూడదు.

**గ్రామాలలోజి శాంతియుత వాతావరణంలో ఐక్యతగా దసరా ఉత్సవాలు జరుపుకోవాలి**

**ఏటూరు నాగారం సిఐ అనుముల శ్రీనివాస్.**

**ఎస్సై .ఎస్కే తాజుద్దీన్.**

ఏటూరు నాగారం. అక్టోబర్,8, వార్త మిర్రర్, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఎవరూ కూడా చేయకూడదునీ సంఘ విద్రోహ శక్తులకు ఎవరూ సహకరించకూడదునీ గ్రామాలలోకి ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినట్లయితే తమకు సమాచారం అందించాలని గ్రామాలలోజిశాంతియుత వాతావరణంలో ఐక్యతగా అందరూ కలిసి మెలిసి దసరా ఉత్సవాలు జరుపుకోవాలినీ ఏటూరు నాగారం సిఐ అనుముల శ్రీనివాస్. ఎస్సై .ఎస్కే తాజుద్దీన్.లు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మాజీ నక్సలైట్లు సాంభూతిపరులకు. కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం వారు ఎవరెవరు ఏం పనులు చేస్తున్నారు వారి యొక్క జీవన ఆధారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో ఎవరిని బెదిరింపులకు గురి చేయకూడదని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే చూస్తూ ఊరుకునేది లేదని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## పారిశ్రామిక వాడా లో ఎమ్మెల్యే గణబాబు శ్రీ శ్రీ దుర్గా దేవి ఉత్సవాలలో పాల్గొన్నారు

విశాఖపట్నం వార్త మిర్రర్ పారిశ్రామిక వాడలో శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు. సారి ఊరేగింపులో పాల్గొన్న పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణ బాబు ప్రకాష్ నగర్, మల్కాపురం ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవ రాత్రులు సందర్భంగా దుర్గాదేవి అమ్మవారి సారి ఊరేగింపులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు మహోత్సవముఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## పాము కాటుతో మృతి చెందిన సాంబన్న మృతదేహానికి నివాళులు అర్పించిన దనసరి సూర్య

ములుగు,అక్టోబర్,8, వార్త మిర్రర్,

ఈ రోజు ములుగు మండలం అబ్బాపురం గ్రామానికి చెందిన సాయబోయిన సాంబయ్య పాముకాటుతో మృతిచెందడం జరిగింది ములుగు ఏరియా హాస్పిటల్ లో వారి మృతదేహానికి రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దనసరి సూర్య నివాళులర్పించి వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని దనసరి సూర్య హామీ ఇచ్చారు వారి మృతి పట్ల తీవ్ర ఆవేదనతో వారి కుటుంబానికి నేను ఎప్పటికీ అందుబాటులో ఉంటూ వారికి సహాయం చేస్తానని చెప్పారు అలాగే ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమానికి ధనసరి సూర్యతో పాటు ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోతు రవిచందర్ కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ ములుగు మండల పార్టీ అధ్యక్షుడు ఎండి చాంద్ పాషా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు జైపాల్ రెడ్డి అబ్బాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు బిక్షపతి యూత్ కాంగ్రెస్ కార్యదర్శి నేపాల్ రావు మరియు మండల జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని వారిదేవానికి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి చెపుతారు




## నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

మందమర్రి అక్టోబర్ 8: వార్త మిర్రర్ ప్రతినిధి దసరా పండుగను పురస్కరించుకొని మా ఊరు సేవా సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని మందమర్రి (వి) గ్రామానికి చెందిన 10 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందించారు. ఈ,సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి ఇబ్రహీం, సేవా సంఘం అధ్యక్షుడు పెద్ది రాజన్న ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం జిల్లా నాయకుడు పాలమాకుల బీంసేన్ లు మాట్లాడుతూ దసరా పండుగను దృష్టిలో పెట్టుకొని అందరిలాగే గ్రామంలోని నిరుపేదలు పండుగను ఆనందంగా జరుపుకోవాలనే లక్ష్యంతో మందమర్రి(వి)లో సేవా సంఘం ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశామన్నారు. ఎవరైనా దాతలు సేవ చేసేందుకు ముందుకు వచ్చి సంఘం ఆధ్వర్యంలో వస్తు రూపంలో పేదవారికి డొనేట్ చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో సంస్థ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## డిసిపి ని కలిసిన మున్సిపల్ చేర్మెన్ బరిగల హేమలత రాజు గౌడ్

తుక్కుగూడ వార్త మిర్రర్ అక్టోబర్ 8 : తుక్కుగూడ మునిసిపల్ చైర్మన్ బరిగెల హేమలత రాజు గౌడ్ మహేశ్వరం డిసిపి సునీతా రెడ్డిని వారి కార్యాలయం లో మర్యాద పూర్వకముగా కలిసి శాలువా తొ సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మునిసిపల్ ప్రెసిడెంట్ రచ్చ లక్ష్మణ్,కౌన్సిలర్ రాజమోని రాజు ,జనరల్ సెక్రటరీ కృష్ణ గౌడ్, జపాల సుధాకర్ ,కుక్కల కృష్ణ, బిజెవైఎం ప్రెసిడెంట్ బరిగెల రాకేష్ గౌడ్ ,బీజేపీ నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



## సెలెబ్రిటీలు సైతం ఇష్టపడే ఎలక్ట్రిక్ స్కూటర్ ఇది.. ధర కూడా తక్కువే

పర్యావరణ హిత ప్రయాణంతో పాటు మెయింటెనెన్స్ లేకపోవడం, లోకల్ అవసరాలకు చక్కగా సరిపోతుండటంతో అందరూ వీటిని ఇష్టపడుతున్నారు. ఈ క్రమంలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అర్జున్ కపూర్ ఇటీవల తన గ్యారేజీకి బీగాస్ ఆర్‌యూవీ 350 ఎలక్ట్రిక్ స్కూటర్ తీసుకొచ్చారు. ముంబైలోని విల్లే పార్లే నుంచి అర్జున్ తన కొత్త రైడ్‌ను ప్రారంభించి, అనేక చిత్రాలు, వీడియోలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. మన దేశీయ మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరుగుతోంది. సామాన్యుల నుంచి సెలబ్రెటీల వరకూ అందరూ వీటిని కొనుగోలు చేస్తున్నారు.

## యువకుని ఆత్మహత్య

మందమర్రి అక్టోబర్ 8: వార్త మిర్రర్ ప్రతినిధి



పట్టణంలోని యాపల్ నివాసముండే మామిడాల తిరుపతి (32) ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మృతునికి గత ఏడు సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి కాలు పలు చోట్ల విరిగింది.పని చేసినపుడు తరచూ కాలు వాపు రావడంతో మద్యానికి బానిసయ్యాడు.దీనికి తోడు రెండు సంవత్సరాల క్రితం తండ్రి మరణించడంతో తీవ్రంగా కుంగిపోయాడు. ఒకవైపుపనిలేకపోవడం,మరో వైపు వివాహం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి దూలానికి చీరతో ఊరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఈ మేరకు మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వృద్ధుని మృతి

మందమర్రి అక్టోబర్ 8: వార్త మిర్రర్ ప్రతినిధి



ప్రమాదవశాత్తు రైలు ఢీకొని సింగరేణి రిటైర్డ్ కార్మికులు మృతి చెందిన ఘటన పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని గాంధీ నగర్ లో నివాసం ఉండే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కంబాల శంకర్(49) మంగళవారం ఉదయం బహిర్భూమికి రామన్ కాలని సమీపంలోని రైల్వే ట్రాక్ దాటుతుండగా ప్రమాద వశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మంచిరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య,కుమారుడు ఉన్నారు. ఈ మేరకు రైల్వే ఎస్సై మహేందర్ పర్యవేక్షణలో జి ఆర్ పి హెడ్ కానిస్టేబుల్ ఈ రాజేశ్వర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## సూపర్ కలర్ ఆప్షన్‌తో నయా వేరియంట్ రిలీజ్ చేసిన టీవీఎస్.. ధరెంతో తెలుసా..?

భారతదేశంలో ఇటీవల కాలంలో బడ్జెట్ బైక్స్ అమ్మకాలు జోరందుకున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు తమకు అనువుగా ఉండే బైక్స్ కోసం సెర్చ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలా కంపెనీలు బడ్జెట్ ఫ్రెండ్లీ బైక్స్‌ను రిలీజ్ చేస్తున్నాయి. హొండా, హీరో, టీవీఎస్ వంటి కంపెనీలు బడ్జెట్ బైక్స్ అమ్మకాల్లో రికార్డులు సృష్టిస్తున్నాయి. తాజాగా ప్రముఖ కంపెనీ టీవీఎస్ మోటర్ తన బడ్జెట్ బైక్ అయిన రేడియన్‌లో కొత్త బేస్ వేరియంట్‌ను రిలీజ్ చేసింది. భారతదేశంలో ఇటీవల కాలంలో బడ్జెట్ బైక్స్ అమ్మకాలు జోరందుకున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలు తమకు అనువుగా ఉండే బైక్స్ కోసం సెర్చ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చాలా కంపెనీలు బడ్జెట్ ఫ్రెండ్లీ బైక్స్‌ను రిలీజ్ చేస్తున్నాయి. హొండా, హీరో, టీవీఎస్ వంటి కంపెనీలు బడ్జెట్ బైక్స్ అమ్మకాల్లో రికార్డులు సృష్టిస్తున్నాయి. తాజాగా ప్రముఖ కంపెనీ టీవీఎస్ మోటర్ తన బడ్జెట్ బైక్ అయిన రేడియన్‌లో కొత్త బేస్ వేరియంట్‌ను రిలీజ్ చేసింది. ముఖ్యంగా కొనుగోలుదారులకు సరసమైన ధరలో ఉండేలా ఈ బేస్ వేరియంట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. టీవీఎస్ రేడియాన్ ఇప్పుడు ఆల్-బ్లాక్ కలర్ ఆప్షన్లో అందుబాటులో ఉంది. ఈ బైక్ ధర రూ. 58,880 (ఎక్స్-షోరూమ్). ఇది బైక్ వెర్షన్ కంటే రూ. 2,525 తక్కువగా ఉంది. ముఖ్యంగా బేస్ వేరియంట్ మిడ్-టైర్ మోడల్ కంటే రూ. 17,514 తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో టీవీఎస్ రేడియాన్ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. కొత్త బేస్ మోడల్ కాంట్రాస్ట్ కోసం బ్రాంజ్ ఇంజిన్ కవర్తో ఆల్-బ్లాక్ పెయింట్ స్కీమ్‌తో వస్తుంది. ఇంధన ట్యాంక్, సైడ్ ప్యానెల్స్‌పై టీవీఎస్ రేడియాన్ బ్రాండ్ వస్తుంది. ఈ అప్‌డేట్స్ కాకుండా ఈ బైక్ సరికొత్త డిజైన్‌తో ఫుల్ బ్లాక్ షేడ్‌తో సహా మొత్తం ఏడు రంగు ఎంపికలతో వస్తుంది. టీవీఎస్ రేడియాన్ బైక్ 109.7 సీసీ ఎయిర్-కూల్డ్, సింగిల్-సిలిండర్ ఇంజిన్ 7,350 ఆర్‌పీఎం వద్ద 8.08 బీహెచ్‌పీ, 4,500 ఆర్‌పీఎం వద్ద 8.7 ఎన్ఎం గరిష్ట టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.4 స్పీడ్ గేర్బాక్స్‌తో వచ్చే ఈ బైక్ సింగిల్ క్రెడిల్ ట్యూబ్యులర్ ఫ్రేమ్‌పై నిర్మించారు. టీవీఎస్ రేడియాన్ టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్క్స్, ట్విన్ రియర్ షాక్స్ వినియోగదారులను అమితంగా ఆకర్షిస్తాయి. ఈ బైక్ 10-లీటర్ల పెట్రోల్ ట్యాంక్‌తో వస్తుంది. ఈ బైక్ డ్రమ్ వేరియంట్ బరువు 113 కిలోలు ఉంటే డిస్క్ వేరియంట్ బరువు 115 కిలోలు ఉంటుంది. ఈ బైక్ 180 మిమీ గ్రౌండ్ క్లియరెన్సుతో ఆకట్టుకుంటుంది.